

ఒక నాడు లక్షల ఎకరాల్లో సాగైన బత్తాయి రాను రాను వేల ఎకరాలకు పరిమితమైంది. బత్తాయికి నిల్వ సామర్థ్యం లేకపోవడం, పండ్ల రూపంలో గరిష్టంగా 10 రోజులకు మించి నిల్వ ఉంటే చేదుగా మారుతుండడం తదితర అంశాలు బత్తాయి సాగుకు పెద్ద ఆటంకంగా మారింది. అయితే జిల్లాలోని బత్తాయి రైతుకు ఊరట కలిగించే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాలోచన చేస్తున్నాయి. వన్‌డిస్ట్రిక్ట్- వన్ ప్రాడక్ట్ పథకం కింద బత్తాయిని చేర్చాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేయడంతో మంచి రోజులు రానున్నాయని రైతులు పేర్కొంటున్నారు.
-(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)



బత్తాయి రైతుకు ఊరట!

- వన్‌డిస్ట్రిక్ట్- వన్ ప్రాడక్ట్ పథకం అమలుకు మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి
- కేంద్రమంత్రి జిల్లా పర్యటనలో తెర మీదకు బత్తాయిసాగు అంశం
- కోల్డ్‌స్టోరేజీ నిర్మించాలని సూచన

కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి నల్లగొండ పర్యటన సందర్భంగా బత్తాయి సాగు అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. నల్లగొండ జిల్లాలో ప్రధాన ఉద్యానపంటగా, మెట్ట రైతులకు కల్పతరువుగా నిలిచిన బత్తాయి పండ్ల తోటల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం, వనరుల కల్పన, మార్కెట్ సదుపాయాల్లేకపోవడం, డిమాండ్ తగ్గిపోవడం, బత్తాయి ప్రాసెసింగ్ చేసి ఉత్పత్తులు విక్రయించే టెక్నాలజీ లేకపోవడంవంటి కారణాలతో పదిహేనేళ్లలో సాగు క్షీణించిపోయింది. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశమున్న పంట అయినప్పటికీ దీన్ని కాపాడుకోవడంలో ప్రభుత్వాలు మద్దతుగా నిలవలేకపోయాయి. ఉమ్మడి జిల్లాలో 2010 ప్రాంతంలో అత్యధికంగా 3.10లక్షల ఎకరాల్లో బత్తాయి సాగైతే, ప్రస్తుతం అది 45వేల ఎకరాలకు పరిమితం కావడం జిల్లాలో బత్తాయి సాగు దుస్థితిని తెలియజేస్తోంది. కేంద్రం 2020నుంచి అమలు చేస్తోన్న వన్‌డిస్ట్రిక్ట్-వన్‌ప్రాడక్ట్ కింద జిల్లాలో బత్తాయి సాగును చేర్చాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం జిల్లా కేంద్రంలో కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ పర్యటన సందర్భంగా కోరడంతో బత్తాయి సాగు అంశం మరోసారి చర్చకు వచ్చింది. ఈ పథకంలో చేర్చడం, కోల్డ్‌స్టోరేజీల నిర్మాణంతో సరిపెట్టకుండా బత్తాయి మార్కెటింగ్‌కు ప్రధాన ఆటంకంగా మారిన నిల్వసామర్థ్యం పెంచేందుకు అవసరమైన టెక్నాలజీని వృద్ధి చేసేందుకు, బత్తాయిలో చేదును తొలగించేందుకు అవసరమైన పరిశోధనలు కొనసాగించేందుకు అవసరమైన కార్యాచరణ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టేలా మంత్రులు, ఎంపీ చొరవ తీసుకోవాల్సి ఉందని బత్తాయి రైతులు కోరుతున్నారు.

టెక్నాలజీకి ఊతమిచ్చేలా..

బత్తాయి పండ్ల నిల్వ అవకాశాలు లేకపోవడం, పండ్ల ప్రాసెసింగ్‌కు జిల్లాలో సరైన సదుపాయాలు లేకపోవడం, బత్తాయి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక వృద్ధికి ఇప్పటివరకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి మద్దతు లేకపోవడంతో జిల్లాలో బత్తాయి సాగు ఎంతవేగంగా పెరిగిందో అంతేవేగంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో బత్తాయి సాగు సంరక్షణపై తాజాగా మళ్లీ చర్చ మొదలవుతున్న నేపథ్యంలో బత్తాయి పండ్ల నిల్వకు, మార్కెటింగ్‌కు వనరులు కల్పించడమే కాకుండా...

- మిగతా 8వ పేజీలో...

కేంద్రమంత్రిని కోరిన కోమటిరెడ్డి

జిల్లాలో బత్తాయి సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను గురువారం నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి దృష్టికి రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీసుకొచ్చారు. జిల్లాలో నాణ్యమైన బత్తాయి ఉత్పత్తి జరుగుతుందని, ఏటా కనీసం 4.50లక్షల మెట్రిక్‌టన్నుల బత్తాయి ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. ఈ ఉత్పత్తుల విక్రయం రైతులకు సవాల్‌గా మారిందని, నిల్వకు అవకాశాలు లేకపోవడంతో రైతులు దళారుల చేతుల్లో దగాపడాల్సి వస్తోందని, దీన్ని నివారించేందుకు వన్‌డిస్ట్రిక్ట్-వన్‌ప్రొడక్ట్ పథకం కింద జిల్లాలో బత్తాయి సాగునిచేర్చి రైతులకు మేలు చేకూర్చాలని మంత్రి వెంకటరెడ్డి కోరారు. ఈ పథకం కింద చేర్చడం ద్వారా రైతులకు సాగు ప్రోత్సాహకాలతోపాటు, మార్కెటింగ్ సదుపాయాలు, కోల్డ్‌స్టోరేజీలు అందుబాటులోకి రానుండడంతో బత్తాయి రైతులకు ఊరట లభిస్తుందని భావిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో బత్తాయి నిల్వ నిమిత్తం ఒక కోల్డ్‌స్టోరేజీని నిర్మించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ఉచిత బియ్యం పథకం

2030 వరకూ కొనసాగిస్తాం

- కేంద్ర ఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి
- నల్లగొండలో ఎఫ్‌సీఐ డివిజన్ కార్యాలయం ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి



కేంద్రమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కేంద్రం అందిస్తోన్న ఉచిత బియ్యం పథకం 2030 వరకు కొనసాగుతుందని కేంద్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన డివిజన్ కార్యాలయ భవనాన్ని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నల్లగొండ జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అదే ప్రాముఖ్యతను కొనసాగిస్తూ జిల్లా ధాన్యం ఉత్పత్తిలో, ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. ఆహారభద్రతా వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్‌కార్డులన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నట్లు చెప్పారు. 7

లక్ష మెట్రిక్ టన్నులు మంజూరు చేయాలి : కేంద్రమంత్రికి గుత్తా లేఖ

2025-26 వానాకాలం సీజన్‌కు సంబంధించి నల్లగొండ జిల్లాకు కనీసం లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్‌రైస్ కోటాను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. గురువారం కేంద్రమంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో మండలి చైర్మన్ ఆయనకు లేఖ రాశారు. జిల్లాకు లక్ష మెట్రిక్‌టన్నుల బాయిల్డ్ రైస్‌కోటా కేటాయిస్తే, సీఎంఆర్ పంపిణీ సజావుగా సాగుతుందని లేఖలో వివరించారు. గోదాముల్లో భారీగా పేరుకుపోయిన బియ్యం నిల్వలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని, ఆనిల్వలను వేగంగా తరలించేందుకు వీలుగా జిల్లాకు అదనపు రైల్వే వ్యాగన్లు, ర్యాక్‌లు కేటాయించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తన ప్రతిపాదనలు ఆమోదించాలని మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి కోరారు.

చికెన్ ధరలు	లైవ్ : రూ.170	డ్రెస్ : రూ.230	స్కిన్‌లెస్ : రూ.260

కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చు

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్

నల్లగొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చునని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదవడమే లక్ష్యంగ పెట్టుకోవాలని, చదువు జీవితంలో ఉన్నత స్థానంలో ఉంచుతుందన్నారు. చదువు అలవాటు చేసుకుంటే ఆలోచన శక్తి, సృజనాత్మక పెరుగుతాయన్నారు. తాను ఇదే గ్రంథాలయంలో మూడేళ్ల పుస్తక పఠనం చేశానన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, కార్యదర్శి బాలమ్మ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ టీ మల్లారెడ్డి, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ యూసుఫ్‌ఖాన్, ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్‌లతో ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ భేటీ

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎఫ్‌సీఐ రాష్ట్ర జనరల్ మేనేజర్ నరసింహరాజు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్‌తో కలసి రైస్‌మిల్లర్లతో భేటీ అయ్యారు. సీఎంఆర్ ధాన్యంపై చర్చించారు. 2024-25 యాసంగి, వానాకాలం సీజన్, 2025-26 వానాకాలం, యాసంగి సీజన్ సీఎంఆర్ డెలివరీల్లో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి నారాయణ, జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రిరాములు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూలకంటి ఇంద్రారెడ్డినల్లగొండ సెంటర్ అధ్యక్షుడు వీరుమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇక నూతన..

విత్తన చట్టం



- రైతులు నష్టపోకుండా ఉండేలా ప్రణాళికలు
- ముసాయిదా విత్తన బిల్లుకు కేంద్రం యోచన
- సలహాలు, సూచనలు సేకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- వానాకాలం నుంచి నూతన చట్టం అమలు

నల్లగొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): త్వరలో నూతన విత్తన చట్టం అమలులోకి రానుంది. ఇప్పటివరకు 1966 సంవత్సరానికి సంబంధించిన విత్తన చట్టం మాత్రమే అమలులో ఉండడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. దీనిని దృష్టిలో ఉంచుకొని నూతన విత్తన చట్టం ముసాయిదా బిల్లు 2025కు సంబంధించి విత్తన రంగంలో మార్పులు తీసుకొచ్చి ముసాయిదా బిల్లును రూపొందించింది. విత్తన నాణ్యతను పెంచడం, రైతులకు నష్టం వాటిల్లకుండా భద్రత కల్పించడం, విత్తన మార్కెట్‌ను మరింత పారదర్శకంగా చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. నూతన విత్తన చట్టం ప్రకారం రైతులకు పూర్తిస్థాయిలో మేలు చేసేలా వారి ప్రయోజనాలు కాపాడేలా చట్టాన్ని రూపొందిస్తున్నారు. విత్తన నాణ్యత పెంచాలనేది ఈ చట్టానికి సంబంధించిన ప్రధాన ఉద్దేశం. పాత విత్తన చట్టంలోని లోపాలను గుర్తించిన కేంద్రం 2025 సంవత్సరం ముసాయిదా విత్తన బిల్లులో ఎలాంటి లోపాలు లేకుండా ముందుకు సాగాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ బిల్లు ముసాయిదా దశలోనే ఉంది. దీనిపై లోతుగా అధ్యయనం చేస్తున్నారు. త్వరలోనే ఈ బిల్లు చట్టంగా మారితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వాల సలహాలు, సూచనలు సేకరించించనుంది.

జిల్లాల వారీగా సలహాలు, సూచనల స్వీకరణ

కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ సలహాలను, సూచనలు స్వీకరిస్తుంది. నల్లగొండలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం నూతన విత్తన చట్టంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూర్యాపేటలో ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేయగా, యాదాద్రిభువనగిరి జిల్లాలో కూడా ఆయా ప్రాంతాల రైతులు, శాస్త్రవేత్తలతో సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూతన విత్తన చట్టం 2025పై అవగాహన, సలహాలు, సూచనల సేకరణ కోసం జరుగుతున్న సమావేశాలకు రైతులు, శాస్త్రవేత్తలు, విత్తన డీలర్లు, సీడ్ ప్రొడక్షన్ ఆర్గనైజర్లు, డిస్ట్రిబ్యూటర్లు, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు హాజరై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, కంపాసాగర్ కృషి విజ్ఞానకేంద్ర ఆధ్వర్యంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేసి కొత్త విత్తన చట్టంపై సూచనలు తీసుకుంటున్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించేందుకు సలహాలు, సూచనల ఆధారంగానే నివేదికలను రూపొందించనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 12లక్షలకు పైగా రైతులు ఉన్నారు. విత్తనాలను నమ్ముకొని పంటలు వేసిన తర్వాత...

- మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం

కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న నూతన విత్తన బిల్లు చట్టానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు, విత్తన డీలర్లతో పాటు అనుబంధ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాం. శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశాల్లో కీలకమైన సమాచారాన్ని సేకరించి నివేదిక తయారు చేస్తున్నాం. నూతన విత్తన చట్టం బిల్లును స్వాగతించడమే కాకుండా విలువైన సలహాలు, సూచనలు, సమాచారాన్ని అందించారు. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. నూతన విత్తన చట్టం వచ్చే వానాకాలం నుంచి అమలులోకి రానుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందడంతో పాటు వారికి భద్రత కూడా ఉంటుంది.



- పి. శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ.

ఫార్ములా ఈ రేస్ కేసులో

చట్టపరంగానే చర్యలు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో చట్టపరంగానే చర్యలు ఉంటాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై స్పందించారు. ఇది విచారణా సంస్థల పరిధిలోని అంశమని, సీఎంకు, తనకు, మంత్రులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తాము కక్ష సాధింపులకు పాల్పడబోమని, చట్టపరంగానే చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ లేనేలేదని, భవిష్యత్ అంతా కాంగ్రెస్‌దేనని అన్నారు. మరో 20 ఏళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని అన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో 90శాతం కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

రహదారులపై ధాన్యాన్ని

ఆరబెట్టవద్దు: ఎస్పీ

నల్లగొండ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ప్రమాదాలకు కారకులు కావొద్దని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదలచేశారు. ధాన్యాన్ని రహదారులపై ఆరబోయడంవల్ల వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు ధాన్యం రాశులను గమనించిక ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు.

బీ.వెల్లెంల ప్రాజెక్టు పూర్తికి

భూ సేకరణే ఆలస్యం

- భూ సేకరణపై ఆసక్తి చూపని ప్రాజెక్టు ఏజెన్సీ
- ప్రధాన ఎడమ కాల్వ భూ సేకరణ పూర్తి
- సగమైనా కానీ ప్రధాన కుడి కాల్వ భూ సేకరణ



7

సాయుధ పోరాట స్ఫూర్తితో

ఉద్యమించాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొనసాగిన సీపీఐ ప్రచారజాత



7

లంకె బిందెలు ఉన్నాయని

నకిలీ నాణేలు ఇచ్చి..

- వ్యక్తి నుంచి రూ.12లక్షలతో ఉడాయించిన నలుగురు నిందితులు
- ఒకరిని పట్టుకున్న మిర్యాలగూడ పోలీసులు



6

నేటి నుంచి సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశం

డీఈవో బొల్లారం భిక్షపతి



నల్లగొండటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల చివరి వారంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టుల తయారీ తదితర అంశాలపై జిల్లాలోని అన్ని యాజమాన్యాల సైన్స్, గణితం ఉపాధ్యాయులకు ఈ నెల 21, 22 తేదీల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బొల్లారం భిక్షపతి ఒకప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని చర్లపల్లిలోగల డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో సమావేశం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు, పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నత ప్రాథమికోన్నత, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న సైన్స్ (భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం), గణితం ఉపాధ్యాయులు సమావేశ నిమిత్తమై పంపించాలన్నారు. దీన్ని అత్యంత ప్రాధాన్యంగా గుర్తించి అందరూ ఆయా సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

చెర్వుగట్టుపై వైభవంగా లక్షపుష్పార్చన

భారీగా తరలివచ్చిన భక్తులు



లక్ష పుష్పార్చన పూజలు చేస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి లక్షపుష్పార్చన వేడుక వైభవంగా జరిగింది. కార్తీకమాసం చివరి రోజు అమావాస్య కావడంతో హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి శివభక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రద్దీ సమయంలో ఘాట్‌రోడ్డుపై వాహనాలను అనుమతించలేదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో సల్వాది మోహన్ బాబు ఏర్పాట్లుచేశారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకు లు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య లక్షపుష్పార్చన వేడుక వైభవం గా జరిగింది. కార్తీక మాసం చివరి రోజు కావడంతో గుట్టపై ఉన్న హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. ప్రసాద శాలను ఈవో సల్వాది మోహన్‌బాబు తనిఖీ చేసి పులిహోర, లడ్డూ ప్రసాదాల తయారీని స్వయంగా తూ కం వేసి, రుచి చూసి నాణ్యతను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఫ్లెక్సీల ఏర్పాటు: గుట్టపై భక్తుల సూచనలతో కూడిన ఫ్లెక్సీలను పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పుష్కరిణిలో తడిబట్టలు, పసుపు కుంకుమలతో స్నానం చేయకూడదని పక్కనే ఉన్న కుళాయిల వద్ద జల్లు స్నానం చేసిన తర్వాతే దిగాలని సూచించారు. ప్రసాదాల కవర్లు ఇతర వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గుట్టపై పలు చోట్ల చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లు పాటించాలని, దర్శన సమయంలో ఇతర భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

సనాతన ధర్మం కోసం వీహెచ్‌పీ పోరాటం...

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడటం కోసం వీహెచ్‌పీ పోరాటం చేస్తుందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి అన్నారు. వీహెచ్‌పీ జిల్లా ధర్మాచార్య సంపర్క్ విభాగ్ ఆధ్వర్యంలో చెర్వుగట్టు దేవస్థానం వద్ద గురువారం ఉదయం నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రతీ నెలా అమావాస్య, పౌర్ణమి తిథుల్లో నిర్వహించే ఈ గిరిప్రదిక్షణకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ ఉంద్యాల ప్రకాశ్‌రెడ్డి, నరసింహ, మేడిశెట్టి వెంకటయ్య, బలేం యాదగిరి, అలుగుబెల్లి వెంకట్ రెడ్డి, మల్లెబోయిన రామలింగం, చల్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

కోదాడటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా కోదాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. భవ్య గురువారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాల ప్రకారం.. కోదాడలో బిల్డర్‌గా పని చేస్తున్న గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వద్ద కోదాడకు చెందిన కొప్పుల కామేశ్వరమ్మ 2017 జనవరిలో రూ.4.50లక్షలు అప్పుగా తీసుకుంది. అందుకు సెక్యూరిటీగా రూ.4.50లక్షల విలువైన చెక్కు ఇచ్చింది. ఆ చెక్కు బ్యాంక్‌లో వేయగా, సరైన నిధులు లేని కారణంగా బౌన్స్ అయింది. దీంతో ఫిర్యాదుదారుడు కోర్టులో కేసు దాఖలు చేశారు. కోర్టు కేసు స్వీకరించి సాక్ష్యాలను విచారణ జరిపి ఇరువర్గాల న్యాయవాదుల వాదనలు విన్న తర్వాత నిందితురాలు కొప్పుల కామేశ్వరమ్మకు రూ.4.50 లక్షల జరిమానా, ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



షేక్ సైదాబీ మృతదేహం

గరిడేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో బుధవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ చలికంటి నరేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గానుగుబండ గ్రామానికి చెందిన షేక్ సైదాబీ(45) భర్తతో కలిసి కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. బుధవారం రాత్రి సుమారు ఎనిమిది గంటల సమయంలో గ్రామంలో చెక్క భజనకు వెళ్లింది. తర్వాత ఎవరికీ చెప్పకుండా ఇంటికి వెళ్లింది. రాత్రి సుమారు 10గంటల సమయంలో గ్రామానికి చెందిన పోకల వెంకటేశ్వర్లు పశువులపాకలో సైదాబీ అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. అదే సమయంలో పోకల ఆంజనేయులు పశువులకు గడ్డి వేయడానికి వెళ్లాడు. అక్కడ సైదాబీ మృతదేహాన్ని చూసి బంధువులకు సమాచారం ఇచ్చాడు. గ్రామానికి చెందిన పాలేల్లి హుస్సేన్‌పై అనుమానం ఉందని సైదాబీ భర్త షేక్ సైదా హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. సైదాబీకి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బాలికను గర్భవతి చేసిన బాలుడి అరెస్ట్

చిట్యాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలికను గర్భవతి చేసిన బాలుడితో పాటు అబార్షన్‌కు ప్రయత్నించిన రిటైర్డ్ ఏఎన్‌ఎంను పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు కేసు వివరాలు వెల్లడించారు. నార్కట్‌పల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలుడు(17) చిట్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చేసుకున్నాడు. ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడు. హాస్టల్‌లో ఉంటున్న బాలిక అనారోగ్యంతో ఈ నెల 17న ఇంటికి రాగా తల్లి కూతురుని తీసుకుని చిట్యాలలో సాయితేజ ఆస్పత్రి నడుపుతున్న రిటైర్డ్ ఏఎన్ఎం సాంబరాజు అండాలును కలిసింది. రిపోర్టుల కోసం ఆమె బాలికను నల్లగొండలోని ఓ స్కానింగ్ సెంటర్‌కు పంపించింది. బాలిక గర్భవతి అని రిపోర్టు రావడంతో తిరిగి బాలిక ఆమె తల్లి చిట్యాలలోని ఆ ఆస్పత్రికి వచ్చారు. రిపోర్టును పరిశీలించిన అండాలు బాలిక నాలుగు నెలల గర్భవతి అని, తనకు రూ.25వేలు ఇస్తే అబార్షన్ చేస్తానని ఒప్పందం కుదుర్చుకుంది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు ఆస్పత్రికి చేరుకుని బాలికతో పాటు మూడో సంతానం వద్దని అబార్షన్ కోసం వచ్చిన మరో మహిళను నల్లగొండలోని సఖీ సెంటర్‌కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐ రవికుమార్, కానిస్టేబుళ్లు మధు, వెంకన్న, వినయ్ పాల్గొన్నారు.

డోరు తెరిచి కారులో కూర్చొవడంతో..

ఆలేరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కారు చోరీకి యత్నించాడని వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గురువారం జరిగింది. స్థానిక ఎస్‌హెచ్‌వో సీఐ యాలాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మునిసిపాలిటీ పరిధిలోని బహదూర్‌పేటకు చెందిన వట్టిపల్లి శ్రీను తన కారులో ఆలేరుకు బయలుదేరి స్థానిక బస్టాండ్ సమీపంలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసి సొంత నిమిత్తం బయటకు వెళ్లాడు. గమనించిన ఓ వ్యక్తి కారు డోరు తెరిచి డ్రైవర్ సీటులో కూర్చున్నాడు. కారును స్టార్ట్ చేసేందుకు ప్రయత్నిస్తుండడాన్ని గమనించిన స్థానికులు అప్రమత్తమై దొంగగా భావించి దేహశుద్ధి చేశారు. ఇంతలో కారు యజమాని శ్రీనివాస్ రావ డంతో విషయం తెలుసుకొని కారు చోరీకి యత్నించిన వ్యక్తిని పోలీసులకు అప్పగించారు. వరంగల్‌లోని శివానగర్‌కు చెందిన మోహన్‌గా గుర్తించారు. అతని తల్లిదండ్రులకు ఫోన్ చేసి విషయం చెప్పారు. అదుపులో ఉన్న మోహన్‌కు మానసిక పరిస్థితి బాగలేక తిరుగుతుంటాడని, అతనిపై ఎక్కడా దొంగతనాల కేసులు లేవని, వదిలి వేయాలని వేడుకున్నారు. అతనిని తల్లిదండ్రులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి.. నిందితుల అరెస్ట్

తుర్కపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని రుస్తాపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలోని బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఎస్‌ఐ తక్యుద్దీన్ తన సిబ్బందితో దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుల నుంచి రూ.4090ల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు సెట్ల పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలలో పూజల కలకలం

వలిగొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పూజలు చేసిన ఆనవాళ్లు కలకలం రేపాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సంగెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలికల మూత్రశాల వద్ద బుధవారం రాత్రి పసుపు, కుంకుమ, నిమ్మకాయ పచ్చి మిరపకాయలు ఉంచారు. గురువారం ఉదయం పాఠశాలను శుభ్రం చేయడానికి వచ్చిన స్వీపర్ అది చూసి ఉపాధ్యాయులకు తెలిపింది. విషయం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆందోళన చేశారు. ఉన్నతాధికారులు సర్ది చెప్పి ఆ ముగ్గును తొలగించడంతో ఆందోళన సర్దుమణిగింది.

సర్వేకు వచ్చిన అధికారుల అడ్డగింత



సర్వేను అడ్డుకుంటున్న రైతులు

చిలుకూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని జానకినగర్‌లో కొన్ని నెలలుగా వివాదాస్పదంగా మారిన డొంక దారి భూమి సర్వే గురువారం కూడా ఆగిపోయింది. డొంక దారిని సర్వే చేసేందుకు సర్వే అధికారులు ముందస్తుగా రైతులకు నోటీసులు జారీ చేశారు. ఇరు వర్గాలకు చెందిన రైతులు సర్వేకు వచ్చారు. ఉదయం 11 గంటలకు పోలీసు బందోబస్తుతో డొంక భూమిని సర్వే చేసేందుకు రెవెన్యూ, సర్వే అధికారులు వచ్చారు. సర్వేకు వచ్చిన అధికారులు ఇరు వర్గాల రైతులతో మాట్లాడి చర్చలు జరిపారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని, ఇరువర్గాల అంగీకారంతో డొంక సర్వేను చేస్తామని ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి చెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. సర్వే వివాదాస్పదంగా ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధ్రువకుమార్, డీఈవో మంద్యానాయర్, ఇన్‌చార్జి సర్వేయర్ నాగార్జున, ఆర్‌ఐలు శ్వేత, మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు పాల్గొన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మునుగోడు రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలం సొల్లేటి గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన ఆదప లక్ష్మయ్య రోజులాగా తాటి చెట్టుపై గీత పెట్టడానికి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. లక్ష్మయ్యను సమీపంలో ఉన్న వారు గమనించి 108 వాహనంలో నల్లగొండ ఆస్పత్రికి తరలించారు.

రాత్రంతా గస్తీ.. జీవితంతో కుస్తీ

- రాత్రి వేళల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్న గూర్ఖాలు
- దేశం కాని దేశంలో రాత్రి వేళలో విధులు
- జీతంలేని ఉద్యోగం... జీవితానికి భద్రత లేని వైనం
- వ్యాపారులు ఇచ్చే పది, పరకతోనే జీవన యానం





జీవన చిత్రం

చేతిలో కర్ర.. రాత్రి 11గంటల నుంచి సైకిల్‌పై పట్టణాల్లో తిరుగుతూ దొంగల బారి నుంచి ప్రజలను అప్రమత్తం చేయడం వారి పని. విజిల్ వేస్తూ, కర్రతో శబ్దం చేస్తూ ప్రతి కాలనీ తిరుగుతూ వెళ్తుంటారు. ఎక్కడో పుట్టి, ఎక్కడో పెరిగి, జీతం లేని ఉద్యోగం చేస్తూ.. భద్రత లేని జీవనాన్ని కొనసాగిస్తున్నారు గూర్ఖాలు. దశాబ్దాల కాలం నుంచి ఎంతో మంది వలసవచ్చి ఉమ్మడి నల్లగొండలో వివిధ పట్టణాల్లో పనిచేస్తున్నారు. దశాబ్దాలుగా ఇక్కడ జీవిస్తున్న గూర్ఖాలు పరిస్థితి దుర్భరంగా మారింది. ప్రభుత్వాలు స్పందించి తమకు సంక్షేమ పథకాలు అందించాలని గూర్ఖాలు అభ్యర్థిస్తున్నారు. నేపాల్ నుంచి ఐదు దశాబ్దాల క్రితం ఓ కుటుంబం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి వలస వచ్చింది. తండ్రి తర్వాత తాను కూడా 30 ఏళ్లుగా పట్టణంలో గూర్ఖాగా పనిచేస్తున్న షేర్ మహర్‌బహద్దూర్‌పై ఆంధ్రజ్యోతి కథనం.

- (ఆంధ్రజ్యోతి - హుజూర్‌నగర్)

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో 30 ఏళ్లుగా షేర్ మహర్‌బహద్దూర్ గూర్ఖాగా పనిచేస్తున్నాడు. ఆయన తండ్రి బహద్దూర్ కూడా మూడు దశాబ్దాలుగా హుజూర్‌నగర్‌లోనే గూర్ఖాగా పని చేశారు. నేపాల్ దేశంలోని సుదూర్ పశ్చిమాంచల్ రాష్ట్రం బహితర్ జిల్లా కపర్‌కోట్‌పాతలి గ్రామానికి చెందిన షేర్ బహద్దూర్ 50ఏళ్ల క్రితం హుజూర్‌నగర్‌కు వచ్చారు. లాక్‌డౌన్ సమయంలో ఆయన నేపాల్ వెళ్లిపోయారు. అంతకుముందే ఆయన కుమారుడు షేక్ మహర్‌బహద్దూర్ హుజూర్‌నగర్‌కు వచ్చి రైస్‌మిల్లులో సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. తండ్రి చనిపోవడంతో రైస్‌మిల్లులో వచ్చే జీతం సరిపోక తండ్రి బాటలోనే బహద్దూర్ గూర్ఖాగా పనిచేస్తున్నారు. హుజూర్‌నగర్‌లోని ఎన్నెస్పీ క్యాంప్‌లోని ప్రభుత్వ స్థలంలో చిన్న గుడిసెలో నివాసముంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కాగా పెద్ద కూతురు నేపాల్‌లోనే అనారోగ్యంతో చనిపోయింది. ఆయన భార్య ఇద్దరు పిల్లలతో నేపాల్‌లోని తమ గ్రామమైన కపర్‌కోట్‌పాతలిలోనే ఉంటూ కొండగుట్టల్లో వ్యవసాయం గోధుమ పంట, మొక్కజొన్న, ఆకుకూరలు అమ్ముకుంటూ పిల్లలతో ఉంటోంది.

ప్రజలను కాపాడేందుకు..

ఇటీవల పట్టణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పెట్టడంతో వ్యాపారస్థులు గూర్ఖాలకు ఇచ్చే రూ.50, రూ.100 కూడా వారికి సక్రమంగా అందడంలేదు. దేశంకాని దేశంలో పుట్టి, మనదేశానికి వచ్చి గూర్ఖాలుగా ప్రతి రోజూ ఐదు గంటల పాటు రాత్రివేళల్లో గస్తీ కాస్తున్న గూర్ఖాలకు వ్యాపారస్తులు, కాలనీ వాసులు ఇతోధిక సహాయం చేయాలని వేడుకొంటున్నారు. పొట్ట నింపుకోవడం, కుటుంబాన్ని సాదుకునేందుకు దేశం గాని దేశంలో బతుకు బండి లాగుతున్నామని షేక్ మహర్‌బహద్దూర్ చెబుతున్నారు. పట్టణంలో గూర్ఖాగా విధులు నిర్వహిస్తున్న సమయంలో దొంగల నుంచి ప్రజలను కాపాడేందుకు గూర్ఖాలు ఎంతగానో ఉపయోగపడే అవకాశం ఉంటుంది. గూర్ఖాలుగా విధులు నిర్వహించే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారి సమాచారాన్ని అందించి విధులు చేస్తున్నారు. ఏ కాలనీలోనైనా దొంగతనం జరిగితే మొదట పోలీసులు కూడా గూర్ఖాలనుంచి సమాచారం సేకరిస్తుంటారు.

పొట్ట చేతపట్టుకొని..

నేపాల్ దేశంలో ఉపాధి తక్కువగా ఉండడంతో ఇండియాకు వచ్చి అనేక సంవత్సరాలుగా జీవిస్తున్నానని బహద్దూర్ పేర్కొంటున్నారు. అక్కడి కంటే ఇక్కడ కరెన్సీ ఎక్కువగా ఉంటుందన్నారు. కాగా నేపాల్ నుంచి ఇండియాకు రావడానికి ఎలాంటి వీసా అవసరం లేదని, మరో దేశానికి వెళ్లాలంటే మరెన్నో ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు ఉంటాయన్నారు. నేపాల్‌కు వెళ్లాలంటే హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లి అక్కడి నుంచి బస్సులో రెండురోజులు ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. నాలుగు రోజుల సమయం పడుతుందని వెల్లడించారు. పొరుగు దేశమైన భారతదేశమంటే అంటే తమకెంతో ఇష్టమైన ప్రదేశమన్నారు.

ఎంత ఇచ్చినా తీసుకోవడమే

కాలనీవాసులు, వ్యాపారస్థులు రూ.10 నుంచి రూ.100 వరకు వారికి తోచిన విధంగా బహద్దూర్‌కు ఇస్తున్నారు. ఆ డబ్బులనే దాచుకుని సంవత్సరానికి ఒకసారి నేపాల్ వెళ్లి కుటుంబాన్ని సాదుకుంటున్నారు. 30రోజులు కష్టపడినా నెలకు రూ.15వేలకు మించి రావడం లేదని షేర్ మహర్ బహద్దూర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంత ఇచ్చినా తీసుకోవడమే తప్ప అదనం రూ.10 ఇవ్వండి అని అడిగేది లేదని బహద్దూర్ పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో గాంధీపార్క్ సెంటర్ నుంచి పాత మెయిన్‌బజార్ మీదుగా పొట్టి శ్రీరాములు సెంటర్, పాత బస్టాండ్, సీఎంఎస్ కాంప్లెక్స్, శాంతి స్థూపం సెంటర్, ఇందిర సెంటర్, కొత్తబస్టాండ్ వరకు మెయిన్‌రోడ్డులో గస్తీ కాస్తూ చేతి కర్రతో షట్టర్లను కొట్టి శబ్దం చేస్తూ పహారా కాస్తుంటారు. ఎన్‌జీఓ కాలనీ, మఠంపల్లి రోడ్డు, లింగగిరి రోడ్డు, లక్కవరం రోడ్డు ప్రాంతాల్లో గస్తీ కాస్తున్నారు. తెల్లవారుజాము నాలుగు గంటల సమయంలో ఇందిర సెంటర్‌లో టీ తాగి జన సంచారం ప్రారంభం కాగానే ఎన్నెస్పీ క్యాంప్‌లోని నివాసానికి వెళ్లి నిద్రిస్తుంటారు. ఇది షేర్ మహర్‌బహద్దూర్ దిన చర్య. సంవత్సరంతా కష్టపడి వచ్చిన ఆదాయాన్ని తీసుకుని నేపాల్‌లోని సొంత గ్రామానికి వెళ్లి కుటుంబంతో నెలరోజులు గడిపి తిరిగి హుజూర్‌నగర్‌కు వస్తానని మహర్‌బహద్దూర్ పేర్కొంటున్నారు.

లంకెబిందెలు ఉన్నాయని నకిలీ నాణేలు ఇచ్చి..

● వ్యక్తి నుంచి రూ.12లక్షలతో ఉడాయించిన నలుగురు నిందితులు ● ఒకరిని పట్టుకున్న మిర్యాలగూడ పోలీసులు

మిర్యాలగూడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): లంకెబిందెలు ఉన్నాయని చెప్పి నకిలీ నాణేలతో ఉన్న కుండ ఇచ్చి పరారైన ఐదుగురు నిందితుల్లో ఒకరిని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మిర్యాలగూడలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లా హరులికలుకు చెందిన గోవిందప్ప(40)తో పాటు మరో నలుగురు మహేశ్, లోహిత్, నాగప్ప, ప్రసన్న గంగప్పలతో కలిసి సులభంగా డబ్బులు సంపాదించాలని అమాయకులను మోసం చేయాలని పన్నాగం పన్నారు. ముందుగా వివరాలు తెలుసుకుని వారితో పరిచయం పెంచుకుని బంగారం ధర ఎక్కువగా ఉన్నందున తక్కువ ధరకు ఇస్తామని నమ్మించి మోసం చేస్తూ డబ్బులు సంపాదించేవారు. ఇదే విధంగా మే నెల మొదటి వారంలో జగిత్యాల పట్టణానికి చెందిన కారపు శ్యామ్‌సుందర్, అతని స్నేహితుడు పనినిమిత్తం పిడుగురాళ్లకు వెళ్లి కారులో తిరిగి కోరుట్లకు వెళ్తూ మార్గమధ్యంలో మిర్యాలగూడలోని ఓ హోటల్ వద్ద ఆగారు. గోవిందప్ప శ్యాంసుందర్‌తో మాటలు కలిపి తాను గతంలో కోరుట్లలో లారీ డ్రైవర్‌గా పనిచేశానని పరిచయం చేసుకొని అతని ఫోన్ నెంబరు తీసుకున్నాడు. తర్వాత రెండు రోజులకు ఫోన్‌చేసి తనకు లంకెబిందెల్లో బంగారు నాణేలు దొరికాయని వాటిని తక్కువ ధరకు ఇస్తానని వచ్చి బంగారాన్ని పరీక్షించుకున్న తర్వాతే కొనుగోలు చేయాలని పదేపదే ఫోను చేసి కర్నాటక రాష్ట్రంలోని హోస్‌పేట దగ్గర బనికల్‌కు పిలిపించి నమూనాగా నకిలీ నాణేల కుండలో నుంచి రెండు నిజమైన బంగారు నాణేలు ఇచ్చి పంపాడు. అవి నిజమైన బంగారు నాణేలుగా తేలడంతో మిగితా బంగారాన్ని కొనుగోలు చేయడానికి బనికల్‌కు రావాలని ఫోన్ చేశాడు. తాను అంతదూరం రాలేనని చెప్పడంతో గతంలో తాము కలిసిన మిర్యాలగూడలోని హోటల్‌కు వచ్చి డబ్బులు ఇచ్చి బంగారం తీసుకెళ్లాని పిలిపించాడు. మే నెల మూడో వారంలో మిర్యాలగూడలోని హోటల్‌లో కలిసి నకిలీ బంగారు నాణేల కుండను చేతులో పెట్టడంతో తిరిగి వాటిని పరీక్షించి తీసుకుంటానని శ్యామ్ సుందర్ చెప్పడంతో పోలీసులు వస్తారని, ఇతరులు చూస్తున్నారని హడావుడి చేసి, భయపెట్టి అతని వద్ద ఉన్న రూ.12లక్షలను గుంజుకుని కారులో పరారయ్యాడు. ఈ విషయమై శ్యామ్‌సుందర్ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో అద్దంకి-నార్కెట్‌పల్లి బైపాస్‌లో కృష్ణపట్నం హోటల్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కర్నాటక రిజిస్ట్రేషన్ గల కారులో అనుమా నాస్పదంగా కన్పించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా గోవిందప్ప నేరం అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. అతని వద్ద నుంచి రూ.5లక్షల నగదు, 200గ్రాములు అచ్చుపోసిన నకిలీ బంగారు నాణేలు, రూ.7 లక్షల విలువైన కారు, స్మార్ట్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగితా నలుగురు పరారీలో ఉన్నారని డీఎస్పీ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

చర్చలు సఫలం.. రాజేష్ అంత్యక్రియలు పూర్తి

కోదాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చర్చలు సఫలం కావడంతో సూర్యాపేట జిల్లా కోదాడలో కర్ల రాజేష్ అంత్యక్రియలు గురువారం పూర్తయ్యాయి. కోదాడ పట్టణానికి చెందిన కర్ల రాజేష్(30)ను, సీఎంఆర్‌ఎఫ్ రిలీఫ్‌ఫండ్ అక్రమాల వ్యవహారంలో ఈ నెల 4వ తేదీన చిలుకూరు పోలీసులు అరెస్టు చేశారు. 10వ తేదీన అతనిని రిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ సబ్‌జైల్ ఉండగా రాజేష్ అస్వస్థతకు గురి అయ్యాడు చికిత్సనిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఈ నెల 16వ తేదీన మృతిచెందారు. పోలీసులు కొట్టటంతోనే రాజేష్ మృతిచెందారని, న్యాయం చేయాలంటూ ఐదు రోజులుగా కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేస్తున్నారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు రాజేష్‌కు అంత్యక్రియలు నిర్వహించేది లేదని ఆందోళన చేశారు. బుధవారం రాత్రి రాజేష్ కుటుంబ సభ్యులు, బంధువులతో సూర్యాపేట డీఎస్పీ చర్చలు జరిపారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ 8లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, డీఎస్పీ సానుకూలంగా స్పందించడటంతో ఆందోళన విరమించారు. దీంతో గురువారం ఉదయం రాజేష్ అంత్యక్రియలు నిర్వహించారు.



రాజేష్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

ఊరంతా ఆహ్వానం

● పెళ్లిపత్రికతో పాటు చీరలు పంపిణీ చేసిన సీతారాంపురం మాజీ సర్పంచ్ దంపతులు

తన చిన్నకుమారుడి పెళ్లికి రావాలని పెళ్లి పత్రికతో పాటు గ్రామంలోని ప్రతి కుటుంబానికీ చీర ఇచ్చి ఆహ్వానించారు యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని సీతారాంపురం గ్రామ మాజీ సర్పంచ్ మాధవి, మాధవరెడ్డి దంపతులు. తమ చిన్నకుమారుడు వరుణ్‌కుమార్‌రెడ్డి వివాహం ఈ నెల 23వ తేదీన బహీరాబాద్‌లో ఉందని గ్రామంలోని ప్రతి కుటుంబం పెళ్లికి రావాలని ఆహ్వానిస్తున్నారు. గ్రామస్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

● ఆంధ్రజ్యోతి, గుండాల



పెళ్లిఆహ్వాన పత్రికతో పాటు చీర పంపిణీ మాజీ సర్పంచ్ మాధవి మాధవరెడ్డి దంపతులు

విద్యుదాఘాతంతో రైతు మృతి



పెండెం సైదులు(ఫైల్)

పాలకవీడు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఎస్‌ఐ కోటేష్, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకవీడు మండలం ఎల్లాపురం గ్రామానికి చెందిన పెండెం సైదులు(42)రెండు ఎకరాల సొంత భూమిలో వరి సాగు చేస్తున్నాడు. గురువారం తన వ్యవసాయ భూమిలో పొలం గట్టుపై ఉన్న గడ్డిని కొడవలితో కోస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క పొలం రైతులు గమనించి సైదులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సైదులుకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..



ఉప్పలమ్మ(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. స్థానిక సీఐ బొడ్డుపల్లి భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మోటకొండూర్ మండలకేంద్రానికి చెందిన వంగపల్లి ఉప్పలమ్మ(50) మండలంలోని హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి వంగపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా ఆలేరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో మహిళకు తల, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్సనిమిత్తం నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మృతిచెందింది. ఉప్పల్మ మర్ది చాట్ల రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అడ్డంకులు.. అభ్యంతరాలు

● మూడు ప్రదేశాల్లో ఆగిన శ్మశానవాటిక పనులు
● రాజుపేటలో రాత్రికి రాత్రే వెలిసిన దేవతల విగ్రహాలు
● మూడు సార్లు సర్వే చేసి స్థలం సేకరించిన అధికారులు

దహన సంస్కారాలు నిర్వహించేందుకు ఆ గ్రామంలో శ్మశాన వాటిక లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినా గ్రామస్థుల అభ్యంతరంతో ఇప్పటికే మూడు చోట్ల స్థలాలు చూసినా లాభం లేకుండా పోయింది. పనులు ప్రారంభమయ్యే సమయంలో శ్మశాన వాటిక స్థలంలో రాత్రికి రాత్రే దేవతల విగ్రహాలు వెలియడంతో పనులు ఆగిపోతున్నాయి.

● ఆంధ్రజ్యోతి, మర్రిగూడ



రాజపేటతండాలో పిల్లర్లకే పరిమితమైన శ్మశాన వాటిక పనులు

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాజుపేటలో శ్మశాన వాటిక కోసం గ్రామానికి దగ్గరల్లో ఉన్న సర్వే నెంబర్ 288లో ప్రభుత్వ భూమిలో మర్రిగూడ మండల రెవెన్యూ అధికారులు సర్వే చేసి 10గుంటల స్థలాన్ని గుర్తించాలని 2020లో అప్పటి కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ ఆదేశించారు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని గుర్తించి అధికారులకు నివేదిక పంపించారు. శ్మశాన వాటిక నిర్మాణం కోసం ఎన్‌ఆర్ ఈజీఎస్ ద్వారా రూ.12లక్షలు కూడా మంజూరు చేశారు. దహన వాటిక పనులు కొనసాగుతుంటే గ్రామపంచాయతీకి సమీపంలో శ్మశాన వాటిక నిర్మించొద్దని తండావాసులు అడ్డుకున్నారు.

భూముల విలువ తగ్గుతుందని..

దీంతో 2021లో అప్పటి ఇన్‌చార్జి కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ స్పందించి శ్మశాన వాటిక గ్రామానికి దూరంగా ఉండే విధంగా సర్వే చేసి స్థలాన్ని గుర్తించాలని ఆదేశించారు. 316సర్వే నెంబర్ల స్థలాన్ని గుర్తించి శ్మశాన వాటిక నిర్మాణానికి సిద్ధంచేశారు. ఇక్కడ కూడా శ్మశాస వాటిక నిర్మించొద్దని కొదరు రైతులు రాత్రికి రాత్రే దేవుళ్ల విగ్రహాలు ఏర్పాటు చేసి, దేవుళ్లు ఉన్న గుడివద్ద దహన వాటికను నిర్మించొద్దని చెప్పారు. భూముల విలువ తగ్గి ధరలు రావని కొంతమంది రైతులను ఉసిగొలిపి పనులు చేయకుండా అడ్డుకున్నారు.

మూడో సారి అంతే..

తిరిగి 2022లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మరోచోట శ్మశాన వాటిక స్థలం గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పాముకొండ గుట్ట సమీపంలో 320సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిని శ్మశాన వాటిక కోసం భూమిని గుర్తించారు. అక్కడ కూడా ఇదే తరహాలో శ్మశాన వాటిక నిర్మించవద్దని కొంతమంది రైతులు రాత్రికి రాత్రే దేవుళ్ల విగ్రహాలను ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. గ్రామంలో స్మశాన వాటిక లేకపోవడంతో మర్రిగూడ, వట్టిపల్లి సర్పంచులు దయతలిస్తే ఆ గ్రామాల శ్మశాన వాటికల్లో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. కొంతమంది సొంత భూములు ఉన్నందున ఆ భూముల్లోనే దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. భూమిలేనివారి బాధ వర్ణనాతీంగా ఉంది.

శ్మశాన వాటిక నిర్మించాలి

రాజుపేటతండా గ్రామపంచాయతీ ఏర్పడి ఏడు సంవత్సరాలు కావొస్తున్నా ఇప్పటికీ గ్రామంలో శ్మశాన వాటిక లేదు. దీతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శ్మశాన వాటిక నిర్మించాలని పనులు ప్రారంభిస్తే, కొంతమంది రాజకీయ నాయకులు వారి స్వార్థ ప్రయోజనాల కోసం, ఈ ప్రాంతంలో స్మశాన వాటిక నిర్మించవద్దంటూ ఆ స్థలంలో రాత్రికి రాత్రే దేవత విగ్రహాలను సృష్టించి పనులు అడ్డుకుంటున్నారు.

జయ ప్రసాద్, రాజుపేటతండా

గ్రామపంచాయతీకి శ్మశాన వాటిక లేనిది వాస్తవమే

శ్మశాన వాటిక కోసం అధికారుల ఆధ్వర్యంలో సర్వేనెంబర్ 288, 316, 320 సర్వేల్లోని ప్రభుత్వ భూమిలో 10 గుంటల స్థలం సేకరించి గుర్తించాం. మొదట్లో 288 సర్వే నంబర్‌లో పనులు కూడా ప్రారంభించాం. పిల్లర్ల వరకు పనులు జరిగాయి. ఆ సర్వే నెంబర్ల సమీపంలో ఉన్న కొంతమంది ఈ ప్రాంతంలో శ్మశాన దహన వాటిక పనులు చేపట్టవద్దని కోర్టు నుంచి స్టే తేవడంతో పనులు ఆగాయి. .

● మున్నయ్య, ఎంపీడీవో



బీ.వెల్లెంల ఎత్తిపోతల పథకం కుడి కాలువ (ఫైల్)

బీ.వెల్లెంల ప్రాజెక్టు పూర్తికి

భూ సేకరణే ఆలస్యం

• భూ సేకరణపై ఆసక్తి చూపని ప్రాజెక్టు ఏజెన్సీ • ప్రధాన ఎడమ కాల్వ భూ సేకరణ పూర్తి • సగమైనా కానీ ప్రధాన కుడి కాల్వ భూ సేకరణ

నార్కట్‌పల్లి, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల పథకం పూర్తికి భూ సేకరణే అడ్డంకిగా మారింది. ప్రాజెక్టు నిర్మాణ వ్యయం అంచనా వ్యయం కన్నా ఎక్కువగా పెరగడమే భూ సేకరణ చేసేందుకు ఏజేన్సీ సంస్థ ముందుకు రాకపోవడానికి కారణమని తెలుస్తుంది. కాల్వలు...డిస్ట్రిబ్యూటరీలు...మైనర్లకోసం భూసేకరణ పూర్తి చేసి కాల్వల నిర్మాణం చేపడితే ప్రాజెక్టు సంపూర్ణం కానుంది. కానీ ప్రాజెక్టు పూర్తికి కాల్వల నిర్మాణం కాకపోవడం కారణ, కాల్వల నిర్మాణం పూర్తికాకపోవడానికి భూసేకరణ చేయకపోవడం కారణం, వెరసి బీ.వెల్లెంల ప్రాజెక్టు అశనిపాతమయ్యాయి.

కాల్వల కోసం 2,888 ఎకరాల భూసేకరణ

లక్ష ఎకరాలకు సాగునీరందించే బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా కుడి, ఎడమ కాలువల (డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు) కోసం సుమారు 2,888 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. కానీ ఇప్పటికీ సుమారు 1200 ఎకరాల భూ సేకరణ మాత్రమే చేశారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలతో పాటు 17 డిస్ట్రిబ్యూటరీలు, మైనర్‌ల నిర్మాణం కోసం సుమారు 405 కి.మీల నిడివి మేర భూ సేకరణ చేయాల్సి ఉంది.

ప్రధాన ఎడమ కాలువ భూసేకరణ పూర్తి

ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా ప్రధాన ఎడమ కాలువ (ఎల్‌ఎంసీ) భూ సేకరణ దాదాపు పూర్తయింది. సుమారు 6.5 కి.మీల నిడివిలో 43,000 ఎకరాలకు సాగునీరందించేలా ప్రతిపాదించిన ఈ ఎల్‌ఎంసీ చిట్యాల మండలంలోని ఉరుమడ్ల చెరువు వద్ద ముగుస్తుంది. ఇందుకు గాను కావాల్సిన మొత్తం 89 ఎకరాల భూ సేకరణను పూర్తిచేశారు. అయితే మునుగోడు మండలం కిష్టాపురం వరకు కాల్వను పొడిగించాలనే ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి. అదే విధంగా 4 డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లతో సుమారు 148 కి.మీల నిడివిలో సుమారు 970 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉండగా ఇప్పటికీ కేవలం 310 ఎకరాలు మాత్రమే చేశారు. ఇంకా 650 ఎకరాల వరకు భూ సేకరణ చేయాల్సి ఉంది.

పూర్తికాని ప్రధాన కుడి కాల్వ భూ సేకరణ

కాగా ప్రధాన (ఆర్‌ఎంసీ) కుడి కాలువ భూ సేకరణ ఇంకా పూర్తికాలేదు. 57,000 ఎకరాల సాగునీరందించే కుడి కాలువ బీ.వెల్లెంల రిజర్వాయర్ నుంచి ప్రారంభమై నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు మూసీలో సంగమించనుంది. సుమారు 25.5 కి.మీల నిడివిలో 389 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉండగా సుమారు 300 ఎకరాల వరకు భూ సేకరణ పూర్తిచేశారు. చిట్యాల మండలంలోని వట్టిమర్తి, వనిపాకల గ్రామాల్లో కాల్వల భూమిని కోల్పోతున్న రైతులు సహకరిస్తే ఆర్‌ఎంసీ కూడా పూర్తికానుంది. కాగా ఆర్‌ఎంసీ పరిధిలోని 13 డిస్ట్రిబ్యూటరీల నుంచి సుమారు 225 కి.మీల నిడివిలో మైనర్ల కోసం 1440 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. కానీ నేటి వరకు 500 ఎకరాలు మాత్రమే సేకరించగా ఇంకా 940 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది.

భూ సేకరణపై ఆసక్తి చూపని ఏజెన్సీ

ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ కాల్వల భూ సేకరణపై పెద్దగా ఆసక్తి చూపనట్లు తెలుస్తుంది. 15 ఏళ్ల క్రితం తయారు చేసిన డీపీఆర్‌లో పేర్కొన్న అంచనా వ్యయంతోనే ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలంటే సాధ్యం కాదనే వాదనను నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల ముందు ఉంచినట్లు సమాచారం. అయితే ఈ విషయంలో అధికారుల నుంచి స్పష్టత రాని కారణంగానే కాల్వల భూ సేకరణకు ఏజేన్సీ సంస్థ ముందుకు రావడం లేదని తెలిసింది. వాస్తవానికి కాల్వల భూ సేకరణ చేయాలంటే ముందుగా ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్ ఇవ్వాల్సి ఉంది. అనంతరం కాల్వల అలైన్మెంట్ మేరకు ప్రతీ 100 మీటర్లకు ఒకటి చొప్పున గుర్తింపు రాళ్లను పాతాల్సి ఉంది. ఇలా మార్కింగ్ చేసిన తర్వాతే రెవెన్యూ అధికారులు ప్రభుత్వ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి రైతు, సర్వే నెంబర్, డివిజన్‌ల వారీగా ఎంత భూమి పోతుందో నివేదిక ఇస్తారు. కానీ సందరు ఏజేన్సీ సంస్థ ఇంకా ల్యాండ్ ప్లానింగ్ షెడ్యూల్ ఇవ్వలేదని సమాచారం.

సన్ భీంకు ఇవ్వాలనే సూచన

కాల్వల భూ సేకరణకు సదరు ఏజెన్సీ సంస్థ ఆసక్తి చూపకపోవడంతో ఆ సంస్థ స్థానంలో మరొక సంస్థకు పనులు అప్పగించాలని నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వ పెద్దలకు సూచించినట్లు తెలిసింది. ప్రస్తుత సంస్థ నుంచి కాల్వల భూ సేకరణ పనులను సన్‌భీం సంస్థకు అధికారికంగా మార్పిడి చేయాలనే సూచనను జిల్లాకు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిల దృష్టికి తీసుకుపోయారని సమాచారం. అయితే సన్‌భీం సంస్థకు పనులు అప్పగించే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

భూ సేకరణ వేగవంతం చేస్తాం



బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకం కాల్వల భూ సేకరణను వేగవంతం చేస్తాం. భూ సేకరణ ఆలస్యం కావడానికి గల కారణాలను జిల్లాకు చెందిన మంత్రులు, మా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కాల్వల భూ సేకరణకు ఏజేన్సీ సంస్థ ముందుకొచ్చేలా మాట్లాడుతామన్నారు. బహుశా వచ్చే నెలలో కాల్వల భూ సేకరణ ప్రక్రియ ప్రారంభమై వేగవంతమయ్యేలా కృషి చేస్తాం.

సీఈ అజయ్ కుమార్, నల్లగొండ

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



తుమ్మల కావ్యశ్రీ



బేతాళ వైష్ణవి



మల్లెబోయిన నికిత

బొమ్మలరామారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆ ధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ అండర్-14 బాల బాలికల టోర్నమెంట్ కం సెలక్షన్స్‌కు హైస్కూల్‌కు చెందిన తుమ్మల కావ్యశ్రీ, బేతాళ వైష్ణవి, మల్లెబోయిన నికిత ఎంపికయ్యారు. గురువారం నిర్వహించిన ఉమ్మడిన ల్లగొండ జిల్లాస్థాయి టోర్నమెంట్‌లో వారు తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 26 నుంచి 28వ తేదీల్లో పెద్దపల్లి జిల్లాలోని టీజీజేఆర్‌సీ(బి) నందిమేడారం, ధర్మారంలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనున్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



అనీష్ జామ్



ఎలేందర్

వెలుగొండూరు: మండలంలోని ముత్తిరెడ్డిగూడెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ - 19 త్రోబాల్ జాతీయస్థాయి పోటీలకు అనీష్‌జామ్, అండర్- 14 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎలేందర్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం గఫార్ తెలిపారు. అండర్ -14 వాలీబాల్ రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు పెద్దపల్లిలో, త్రోబాల్ జాతీయస్థాయి పోటీలు డిసెంబర్ 5 నుం చి 7వ తేదీ వరకు మహారాష్ట్రలో జరుగుతాయని పీఈటీ నాగరాజు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్, త్రోబాల్‌లలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

సేంద్రీయ ఉత్పత్తులు ఆరోగ్యకరం

• దేశవాళీ రకాల వరి వంగడాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

మోత్కూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సేంద్రీయ పద్ధతిలో సాగు చేసిన ఉత్పత్తులు ఆరోగ్యకరమని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటరమణారెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండల కేంద్రంలో గురువారం బిల్లపాటి గోవర్ధన్‌రెడ్డి సాగు చేసిన 23 రకాల దేశవాళీ (పురాతన)వరి వంగడాలను వారు పరిశీలించారు. విత్తన బ్యాంకు కోసం 23రకాల వరి వంగడాలను సాగు చేసిన రైతు మహేందర్‌రెడ్డిని వారు అభినందించారు. విత్తనాలు సేకరణ, సాగు గురించి అడిగి తెలుసుకున్నారు. విత్తన ఉత్పత్తి చేసిన తర్వాత తమకు చెబితే ఇతర రైతులకు సమాచారం ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. ఒక్కో గుంటలో ఒక్కో రకం వరి సాగు చేసినందున ఆ వరి పేరు, ఆ ధాన్యం (బియ్యం) తినడం వల్ల కలిగే ప్రయోజనాలేమిటి అన్నది బోర్డులు రాసి పెట్టాలని రైతుకు సూచించారు. ఇతర రైతులను కూడా ఈ క్షేత్రానికి తీసుకువచ్చి చూపిస్తామన్నారు. ఈ వరి పంటలు ఆరోగ్యానికి శ్రేష్ఠమని, అందులో సేంద్రీయ పద్ధతిలో సాగు చేయడం మరింత ఆరోగ్యకరమని అన్నారు. విత్తనాల ఉత్పత్తిని, పంటల సాగును పెంచాలని, అందుకు వ్యవసాయ శాఖ నుంచి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వి.కీర్తి, ఏఈవోలు గోపీనాథ్, అశోక్, సింహప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు, వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన విస్తరణ సలహా మండలి సభ్యుడు మంతపురి యాదగిరి, జనగామ జిల్లా జీడికల్లు, రైతులు ఉన్నారు.

2030 వరకు ఉచిత బియ్యం పథకం కొనసాగిస్తాం

• కేంద్ర ఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి • నల్లగొండలో ఎఫ్‌సీఐ డివిజన్ కార్యాలయం ప్రారంభం • పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి కేంద్రం అందిస్తోన్న ఉచిత బియ్యం పథకం 2030 వరకు కొనసాగుతుందని కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన డివిజన్ కార్యాలయ భవనాన్ని మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఉచిత బియ్యం పథకం కింద లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ నెలకు 6 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్న విధానాన్ని వివరించా రు. నల్లగొండ జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అదే ప్రాముఖ్యతను కొనసాగిస్తూ జిల్లా ధాన్యం ఉత్పత్తిలో, ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. ఆహారభద్రతా వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు రేషన్‌కార్డులన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నట్లు చెప్పారు నల్లగొండ ఎఫ్‌సీఐ కాంప్లెక్స్ పరిధిలో ప్రస్తుతం 62వేల మె ట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములున్నాయని, రాష్ట్ర ప్రభు త్వం భూమిని కేటాయిస్తే మరో 38 వేల మెట్రిక్ ట న్నుల నిల్వ సామ ర్థ్యం గల గోదాములను నిర్మిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి, వేదికపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

బాయిల్డ్ బియ్యం నిల్వలకు అదనపు ర్యాక్‌లు కేటాయించాలి : మంత్రి ఉత్తమ్

నల్లగొండ జిల్లాలో ఎఫ్‌సీఐ గోదాముల్లో బియ్యం నిల్వ ఉండడంతో సీఎంఆర్ బియ్యం డెలివరీకి ఇబ్బంది కలుగుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాకు అదనపు ర్యాక్‌లు కేటాయించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ వానాకాలం సీజన్‌లో దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగితే, అందులో 80లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కేం ద్రం రాష్ట్ర కోటాను పెంచాలని విన్నవించారు. అలాగే పదేళ్లుగా పెండింగ్ ఉన్న సీఎంఆర్ బకాయిలు రూ. 1,400 కోట్లు చెల్లించాలని, పీడీఎస్‌కు సంబంధించి రూ.343 కోట్ల సబ్సిడీ మొత్తం విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. 2024-25 ఖరీఫ్‌కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీకి 60 రోజుల గడువు, అదే యేడాది యాసంగికి సంబంధించి 120 రోజుల గడువు పెంచాలని కోరారు. నల్లగొండలో ఎఫ్ సీఐ గోదాముల్లో మరో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు నిర్మించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు.

వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రంగా మార్చాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ జిల్లాను వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రంగా మార్చేందుకు కేంద్రం సహకరించాలని, అందుకువసరమైన పథకాలు, నిధులు కేటాయించాలని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. జిల్లాలో వాతావరణం, నేల ల స్వభావం అనుకూలం గా ఉండడంతో వరి సాగు విస్తృతమైందని, ఎఫ్‌సీఐకి ధాన్యం అందించడంలో నల్లగొండ జిల్లాదే ముఖ్యమైన పాత్ర అని పేర్కొన్నారు. యాసంగిలో తుపాన్ల ప్రభావంతో పంటలు దెబ్బతిన్నప్పటికీ 8.54లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం పండించారని వెల్లడించారు. అకాలవర్షాలు, నిల్వ, భ ద్రతవ్యవస్థలు లేకపోవడంతో ధాన్యం నాణ్యత కోల్పోవాల్సి వస్తోందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని నల్లగొం డ జిల్లాకే అత్యాధునిక గోదాములు నిర్మించాలని కోరారు. శాస్త్రీయ పద్ధతిలో ఎక్కువ ధాన్యం నిల్వ చేసే లా స్టీల్ సైలోస్, గ్రెయిన్ డ్రయర్స్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా కేంద్రానికి సమీపంలోఉన్న తిప్పర్తిలో కావాల్సినంత ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని, ప్రైవేట్ పబ్లిక్ భాగస్వామ్యంలో అక్కడ లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల అత్యాధునిక గోదా ము నిర్మించాలని కోరారు.

నల్లగొండ జిల్లాలో బాయిల్డ్ రైస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతున్నందున ఇక్కడి మిల్లుల నుంచి బాయిల్డ్, రా రైస్ అనే బేధాలు లేకుండా ఏ బియ్యం ఉత్పత్తయితే ఆ బియ్యం ఎఫ్‌సీఐ తీసుకోవాలని కోరారు. నల్లగొండ జిల్లాలో ప్రతియేటా 4.50 లక్షల మెట్రిక్ టన్నుల బత్తాయి పండ్లు ఉత్పత్తి అవుతాయని, ఈ పంటను సంరక్షించేందుకు అవసరమైన కోల్డ్ స్టోరేజీని ఇక్కడ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కేం ద్రం అమలు చేస్తోన్న ఓడీఓపీ (వన్‌డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్) పథకం కింద బత్తాయిని చేర్చాలని కోరారు.

ఈ పథకంలో చేర్చితే అధికారిక బ్రాండింగ్, మార్కెటింగ్, మార్కెట్ అనుసంధానం, ధర లభిస్తుందని తెలిపా రు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎ మ్మెల్సీ శంకర్‌నాయక్, ఎఫ్‌సీఐ ఈడీ వనితాశర్మ, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, అ మిత్‌నారాయణ్, ఎఫ్‌సీఐ మేనేజర్ జీవన్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

సాయుధ పోరాటస్ఫూర్తితో ఉద్యమించాలి

• ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
• ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొనసాగిన సీపీఐ ప్రచారజాత



హుజూర్‌నగర్‌లో ప్రచారజాతకు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మిర్యాలగూడ/వేములపల్లి/నేరేడుచర్ల/హుజూర్‌నగర్/మాడ్గులపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించాలని ఎమ్మెల్సీ, సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. గురువారం వేములపల్లి, మాడ్గులపల్లి మిర్యాలగూడ, నేరేడుచర్ల హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ మండలంగోపాలపురంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రచార జాతలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ వందేళ్ల ప్రస్థానంలో పార్టీ నాయకులు ఎన్నో త్యాగాలు చేశారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని కోరారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజా సమస్యలపై పార్టీ సాగించిన పోరాటాలు, ఉద్యమాలను మన నం చేసుకుంటే భవిష్యత్ కార్యాచరణపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసేందుకు రాష్ట్రంలో మూడు జాతాలు ప్రచారం సాగిస్తుండగా జోగులాంబ గద్వాల నుంచి బయలుదేరిన జాత 6వ రోజు మిర్యాలగూడకు చేరుకుందన్నారు. వందేళ్ల సందర్భంగా డిసెంబరు 26న నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. హుజూర్‌నగర్ ప్రాంతం తెలంగాణ సాయుధ పోరాటాలకు కేంద్రంగా నిలిచిందన్నారు. మిర్యాలగూడ, వేములపల్లి ప్రచార జాతలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనర్సింహ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, లొడంగి శ్రవణ్‌కుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, గణేష్‌నాయక్, జగన్, గణేష్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు. హుజూర్‌నగర్‌లో సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాసు, బెజవాడ వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్‌యాదవ్, గోపాలపురంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. నేరేడుచర్లలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింహ, రాష్ట్ర కమిటీ సభ్యులు ధనుంజయనాయుడు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో సీపీఐది ప్రత్యేక స్థానం


బీబీనగర్: దేశ రాజకీయాల్లో సీపీఐది ప్రత్యేక స్థానం సంపాదించుకుందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకోబోతున్న సందర్భంగా బాసర నుంచి ఖమ్మం వరకు ఈనెల 15నుంచి చేపట్టిన ప్రచార జాత గురువారం రాత్రి బీబీనగర్‌కు చేరుకుంది. జిల్లాకార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోద శ్రీరాములు ప్రచార జాత బృందానికి స్వాగతం పలికారు. స్టేషన్ రోడ్డులో ఉన్న దొడ్డి కొమురయ్య, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, నాయకులు నరేంద్ర ప్రసాద్, ఎండీ. ఇమ్రాన్, సత్యనారాయణ, చేతరాజు ఉప్పలయ్య బృందం పాల్గొన్నారు.

జిల్లా స్థాయి యువకళాకారుల ఎంపిక పోటీలు రేపు

నల్లగొండ కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువకళాకారుల ఎంపి క పోటీలు పట్టణంలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రె డ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 22వ తేదీన నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో అక్బర్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ యువజనోత్సవాల సందర్భంగా నిర్వహించే ఈ పోటీలకు 15 నుంచి 29 సంవత్సరాలలోపు వయస్సు కగిలిన వారు అర్హులని తెలిపారు. జానపద నృత్యం, జానపదపాటలు, కథారచన, పెయింటింగ్, ఉపన్యాసం, కవిత్వం వంటి అంశాలపైన పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.

జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయికి, రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారిని న్యూఢిల్లీలో జనవరి 10 నుంచి 12వ తేదీవరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 21వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు తమ పేర్లను డీవైఎస్‌వో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, ఇతర వివరాలకు కోసం 8074487020 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి మాధవీలత

యాదగిరిగుట్ట రూరల్, నవంబరు 20, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి మాధవీలత అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో యూనివర్సల్ చిల్డ్రన్స్‌డేలో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. బాల్య వివాహాలు నిషేధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో చట్టం, న్యాయ సహాయం, మాదక ద్రవ్యాల నిషేధం, విద్యా హక్కు చట్టం తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాట్రిన్ సోని, బాలికలు, న్యాయ సేవ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా తులసీ దామోదర కల్యాణం



తులసీ దామోదర కల్యాణం, సత్యదేవుని వ్రతంలో పాల్గొన్న ఈవో వెంకట్రావు, ధర్మకర్త నరసింహమూర్తి

సత్యదేవుని వ్రతం, కార్తీక వన భోజనాలు

యాదగిరిగుట్ట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో గురువారం తులసీ దామోదర కల్యాణం, సత్యదేవుని వ్రతం జరిపించి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఏసీపీ పి.శ్రీనివాసులునాయుడు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తులసీ దామోదర కల్యాణం, సత్యదేవుని వ్రతం వైభవంగా జరిపించారు. కాగా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచారాత్రగమశాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 20,30,157 నిత్యాదాయం, కార్తీక మాసం (అక్టోబరు 22 నుంచి నవంబరు 20 వరకు) ఆన్‌లైన్ సేవల ద్వారా రూ. 65,57,292 కలిపి రూ. 85,87,449 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

మట్టపల్లిలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో గురువారం నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా భక్తులు కోటి దీపాలు వెలిగించి భక్తి చాటుకున్నారు. గురువారం రాత్రి ఆలయ రాజగోపురం వద్ద మహిళలు ప్రమీదలతో కోటి వత్తులు వెలిగించి పారవశ్యంతో తరించారు.



మఠంపల్లి: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నల్లగొండ
నకిరేకల్ - మునుగోడు



బీ.వెల్లెంల రిజర్వాయర్‌కు నీటి విడుదల

నార్కట్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డెడ్ స్టోరేజీకి చేరిన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లెంల ఉదయసముద్రం ఎత్తిపోతల రిజర్వాయర్‌కు గురువారం నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారులు రిజర్వాయర్‌ను నింపేందుకు పంప్ మోటారును గురువారం మధ్యాహ్నం ఆన్ చేశారు. ఇటీవల భారీ వర్షాలతో పానగల్ ఉదయసముద్రంలో కూడా సరిపోను నీటి లభ్యత ఉన్న కారణంగా 24గంటల పాటు ఒక మోటారు ద్వారా సుమారు 460 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేస్తూ 7రోజుల్లోగా రిజర్వాయర్‌ను నీటితో నింపనున్నారు. రిజర్వాయర్‌కు నీటి విడుదల చేసిన కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈలు పిచ్చయ్య, విఠలేశ్వర్, ఏఈఈలు శ్రీశైలం, మాధవిప్రియ, నాగరాజు, నవీన్ ఉన్నారు.

విద్యుత్ సమస్యలకు మోక్షం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

- 3,18,19 వార్డుల్లో తీరనున్న విద్యుత్ వెతలు
- రూ.62లక్షలు మంజూరు చేసిన ఎస్పీడీసీఎల్
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో పానగల్ రోడ్డులో ఉన్న 3,18,19వ వార్డులలో విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. కొన్ని నెలలుగా అనేక సమస్యలతో ఆ ప్రాంత గృహ విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టీజీఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ ఆ మూడు వార్డులకు రూ.62లక్షలు మంజూరు చేశారు. గాలి దుమారంతో పాటు వర్షం వచ్చినప్పుడల్లా విద్యుత్ ట్రిప్ అయి కరెంట్‌కు అంతరాయం కలుగుతుండేది. అయితే గతంలో ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని శ్రీరాంనగర్ కాలనీలో రూ.20లక్షలతో 11 కేవీ విద్యుత్ లైన్ స్పెషల్ ఫీడర్ ఏర్పాటు చేశారు. దీంతో కొంత వరకు సమస్య తీరింది. అయితే 3, 18, 19వ వార్డుల్లో విద్యుత్ సమస్యకు సంబంధించి పరిశీలిస్తే లోవోల్టేజీతో పాటు త్రీఫేజ్ వైర్ లేకపోవడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాకపోవడంతో పాటు ఇంటర్మీడియట్ పోల్స్ ఏర్పాటు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రూ.42 లక్షలను కేటాయించింది. అంతేకాక పానగల్ సబ్‌స్టేషన్ నుంచి శ్రీనగర్‌కాలనీ 19వ వార్డులోని ఈ కాలనీ వరకు 11 కేవీ విద్యుత్ లైన్, స్పెషల్ ఫీడర్ ఏర్పాటు కోసం మరో రూ.20 లక్షలు మొత్తంగా ఈ మూడు వార్డులకు రూ.62 లక్షలు మంజూరవడంతో విద్యుత్ సమస్యలు తీరనున్నాయి. ఇకపోతే నిధులు మంజూరు కావడంతో విద్యుత్‌శాఖ అధికారులు త్వరితగతిన ఈ పనులు ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు సైట్ ప్లాన్‌తో పాటు ఎస్టిమేషన్ వేసి పనులు చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీసీరోడ్డు నిర్మాణానికి మరో రూ.10లక్షలు

19వ వార్డులోని శ్రీనగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం రాజ్యసభ సభ్యుల నిధుల నుంచి మరో రూ.10లక్షలు మంజూరయ్యాయి. శాసనసభ మాజీ స్పీకర్, ప్రస్తుత రాజ్యసభ సభ్యులైన కేఆర్ సురేష్‌రెడ్డి నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ కాలనీలో వర్షం వచ్చినప్పుడు బురదమయం అవుతుంది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయింపులు జరిగాయి. శ్రీనగర్ కాలనీలో ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు ఇబ్బందులు తొలగనున్నాయి.

నిధులు మంజూరుతో తీరనున్న సమస్యలు



ఆరు నెలలుగా కలెక్టర్, విద్యుత్ శాఖ సీఎండీ, సీఈకి, ఎస్ఈ, ఇతర అధికారులకు నిధుల మంజూరు కోసం తాను చేసిన విజ్ఞప్తుల మేరకు రూ.62లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఎమ్మెల్సీ కోటిరెడ్డితో పాటు సంబంధిత శాఖ అధికారులతో ఈ నిధులు మంజూరు కావడం వల్ల విద్యుత్ కష్టాలు తొలగిపోనున్నాయి. నిధులు మంజూరుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు. అదే విధంగా రాజ్యసభ ఎంపీ సురేష్‌రెడ్డి నిధుల నుంచి రూ.10లక్షలు సీసీ రోడ్డు నిర్మాణం కోసం మంజూరు చేశారు. ఈ నిధులతో శ్రీనగర్ కాలనీలో రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయనున్నాం. అదే విధంగా నిధుల మంజూరు కోసం సహకరించిన బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్‌కు ధన్యవాదాలు. 3,18,19 వార్డుల్లో విద్యుత్ పనులతో పాటు రోడ్డు నిర్మాణం కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

- సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్

మధ్యాహ్న భోజన రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణ

నల్లగొండరూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శిగా నల్లగొండ జిల్లాకు చెందిన పోలె సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా పానుగంటి లక్ష్మమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో నవంబరు 17, 18వ తేదీల్లో నిర్వహించిన తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నార్కట్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన సత్యనారాయణ స్వామి ఉపాలయంలో ఈ నెల 27న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన, డిసెంబరు 10న నిర్వహించే మండల పూజా మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం ఆవిష్కరించారు.

చిట్యాల పీహెచ్‌సీకి నూతన భవనం మంజూరు చేయండి

- కలెక్టర్‌కు డీఎంహెచ్‌వో శ్రీనివాస్ లేఖ
- 'ఆసుపత్రికి సమస్యల సుస్తీ' కథనానికి స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు ప్రస్తావిస్తూ ఆంధ్రజ్యోతి మినీలో గురువారం ప్రచురితమైన 'ఆసుపత్రికి సమస్యల సుస్తీ' వార్తకు అధికారులు స్పందించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్లా శ్రీనివాసులు ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ ఆసుపత్రి 24 గంటల పాటు వైద్య సేవలందిస్తుందని పేర్కొన్నారు. ఈ భవనం దాదాపు 25 ఏళ్ల క్రితం నిర్మించారని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో శ్లాబు పెచ్చులు ఊడుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా వర్షం వస్తే కురుస్తుందని, గోడలు పగుళ్లు బారాయని పేర్కొన్నారు. ఇక్కడ పనిచేయడానికి డాక్టర్లు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందుల నేపథ్యంలో ఈభవనాన్ని తొ లగించి నూతన భవనాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఆంధ్రజ్యో తి మినీలో వార్త ప్రచురితమవడం, దీనిపై జి ల్లా వైద్యాధికారి స్పందించడంతో చిట్యాల వాసులు, ఆసుపత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఎల్లమ్మకు కార్తీక దీపారాధన పూజలు

కనగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కార్తీకమాసం చివరి రోజును పురస్కరించుకుని గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక దీపాలు వెలిగించి దీపాదన చేశారు. సాయంత్రం ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి అమ్మవారికి మహామంగళ హారతులిచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

నార్కట్‌పల్లి: కార్తీక మాసం చివరి రోజు అమావాస్య తిథిని పురస్కరించుకు ని నార్కట్‌పల్లి మండలకేంద్రంలోని పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం శివలింగానికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు నిడిగొండ భగవాన్‌శర్మ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు, పూజలు చే శారు. అనంతరం గోమాతకు పూజలు నిర్వహించి బియ్యం సమర్పించారు. ఈ వేడుకలో ఆలయ చైర్మన్ పుల్లెంల శ్రీనివాస్, జెరిపోతుల భరత్, దోసపాటి వి ష్ణుమూర్తి, కర్నాటి రమాదేవి, సంపత్, లక్ష్మి భక్తులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలు, శివుడికి రుద్రాభిషేకం

చిట్యాలరూరల్: కార్తీకమాసం చివరిరోజున చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో గ్రామస్థులు శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పురోహితుడు జయంత్‌శర్మ ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు రుద్రాభిషేకం చేశారు. మహిళలు కోనేరు వద్ద దీపాలను వెలిగించారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

కురుమల హక్కుల సాధన కోసం కృషి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కురుమలకు చెందాల్సిన హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నట్లు కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుండే వెంకటేశం అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరల్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కురుమల సంక్షేమానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు గొరిగె నరసింహ, సలహాదారులు పోచయ్య, ప్రసన్న, రావుల ఐలయ్య, రమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

నార్కట్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికవర్గం ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సీఐటీయూ మండల మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. ఐక్యత, పోరాటం నినాదంతో ఆవిర్భవించిన సీఐటీయూ కార్మికవర్గాల హక్కుల సాధన పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న, నాయకులు చెర్కు పెద్దులు, ఆమనగంటి ఐలయ్య, రవి, గోపాల్, ఎల్లయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

ఇక నూతన విత్తన చట్టం

(5వ పేజీ తరువాయి)

దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులకు ఉపయోగపడే విధంగా వివరాలు తీసుకుంటున్నారు.

ప్రతి కంపెనీ విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్

నూతన విత్తన చట్టం వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమల్లోకి రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాల వారీగా సేకరిస్తున్న సలహాలు, సూచనలను ఒక్కటి, రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపనున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి నివేదికలు సేకరించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 11వ తేదీలోపు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపనుంది. ఈ నూతన విత్తన చట్టానికి అన్ని వర్గాల నుంచి ఆమోదం లభిస్తుంది. ప్రస్తుతం పాతచట్టం అంటే 1966 సంవత్సరం ప్రకారం నోటిఫైడ్ అయిన ప్రభుత్వం నుంచి లైసెన్స్‌డ్ విత్తనాలు విక్రయిస్తున్నా చాలాచోట్ల ఇతర విత్తనాల వల్ల కూడా రైతులకు నష్టం వాటిల్లుతోంది. నూతనచట్టం ప్రకారం విత్తనోత్పత్తి చేస్తే కొత్త చట్టానికి అనుగుణంగా లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో నమోదైన తర్వాతే విత్తనాలు విక్రయించేలా చర్యలు తీసుకోనున్నారు. దీనికి తోడు ప్రతి విత్తన ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్‌తో పాటు ధర తప్పని సరిగా ముద్రించాల్సి ఉంటుంది. క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసిన వెంటనే ఆయా కంపెనీ వివరాలు వెల్లడవుతాయి. నాణ్యతను విస్మరించి రైతులకు నష్టం వాటిల్లేలా చేస్తే రెండేళ్ల జైలుతో పాటు రూ.30లక్షల వరకు జరిమానా విధించే విధంగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నారు. చిన్నచిన్న పొరపాట్లు చేస్తే లైసెన్స్ కూడా రద్దు చేస్తారు. ప్రతీ కంపెనీకి సంబంధించి అనుమానం వస్తే నమూనాలు సేకరించిన తర్వాత ల్యాబ్‌లో టెస్ట్ చేయడానికి రూ.5లక్షల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉండటంతో పకడ్బందీగా విత్తన బిల్లును రూపొందించాలని కేంద్రం తలపెట్టింది.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా సంక్షేమ అధికారి కేవీ కృష్ణవేణి

నల్లగొండటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా సంక్షేమ అధికారిణి కేవీ కృష్ణవేణి అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని బాలసదనంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నల్లగొండ పట్టణంలో నిర్వహిస్తున్న బాలసదనంలో తల్లిదండ్రులు 18 సంవత్సరాలలోపు బాలికలకు ఆశ్రయంతో పాటు విద్య, వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని బాలికలు ఉన్నత చదువు పూర్తి చేసి జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనాథ బా లికలకు ఎలాంటి ప్రవేశం లేకుండా పాలిటెక్నిక్ కోర్సు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అనాథ బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. బాలికలంతా పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా బాలసదనంలోని బాలికలకు నిర్వహించిన వివిధ ఆటల పోటీల్లో విజేతలకు ఆమె బహుమతులు అందజేశారు. అనంతరం బాలల హక్కులను కాపాడాలని కోరుతూ ప్రతిజ్ఞ చేసి, సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్మన్, చింత కృష్ణ, సీడబ్ల్యూసీ సభ్యులు వెంకన్న, భాస్కర్, బీఆర్‌బీ కో ఆర్డినేటర్ హరిత, డీపీవో ఎన్.మనోజ్, డీసీపీవో గణేష్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ మహేష్ డీసీపీయూ సిబ్బంది తేజ, విద్య, వెంకన్న, రేవతి, నర్సింహ, అంజలి, ఎల్లేశ్వర్, పాల్గొన్నారు.



కేతేపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో అస్రాఅంజుమ్

కేతేపల్లి: పిల్లల హక్కుల రక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని నకిరేకల్ సీడీపీవో అస్రాఅంజుమ్ కోరారు. బేటీ బచావో.. బేటీ పడావో... కార్యక్రమంలో భాగంగా కేతేపల్లి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో వంద రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమాల్లో బాల్యవివాహాలు, బాల కార్మికులు, అక్రమ దత్తత, పిల్లలపై జరిగే లైంగిక వేధింపులపై ప్రజలకు అంగన్‌వాడీ, మండల సమాఖ్య సభ్యులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం వి.మల్లేష్, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శోభారాణి, ఎంపీవో నాగలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.కళావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



బాలసదనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి

విద్యతోనే బాలిక భవిష్యత్తు : ఏసీడీపీవో

మునుగోడు: సమాజంలో విద్యతోనే బాలికల భవిష్యత్తు ఉంటుందని ఐసీడీఎస్ మునుగోడు ఏసీడీపీవో దేప వెంకటమ్మ అన్నారు. మునుగోడులోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం బాలిక విద్యకోసం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తోందన్నారు. బాలికల పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు వాటి పర్యావసనాలు గురించి వివరించారు. బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివేష, నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాలల నిర్వాహకులు, టీచర్లు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలి

- కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

నల్లగొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సం స్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీచేయాలని ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాలుగా సహకరిస్తున్నా కేంద్రంపై అ సత్య ప్రచారం చేస్తుందన్నారు. పేదలకు ఉచితంగా 5 కిలోల బియ్యం ప్రతీ నెలా కేంద్రప్రభుత్వం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆ బ్యాగులపై ప్రధానమంత్రి మోదీ బొమ్మ ముద్రించడం లేదని విమర్శించారు. కరోనా సమయంలో కేంద్రం 18 ఆక్సిజన్ ప్లాంట్లు మంజూరుచేయగా అందులో ఒకటి నల్లగొండకు మంజూరు చేశామని, నాగార్జునసాగర్‌కు సైనిక స్కూల్‌ను ఇచ్చామన్నారు. కేంద్రం నిధులతోనే నల్లగొండలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. రైల్వేస్టేషన్ ఆధుని కీకరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు బూర నర్సయ్యగౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు పాల్గొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

నాంపల్లి కోర్టుకు హాజరైన జిల్లా బీజేపీ నేతలు

నల్లగొండ క్రైం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021 సంవత్సరం నవంబరు 15వ తేదీన నల్లగొండ సమీపంలోని ఆర్జాలబావి ఐకేపీ కేంద్రం వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి గురువారం నల్లగొండకు చెందిన బీజేపీ రాష్ట్ర నాయకులు, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌తో కలిసి నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం కాలయాపన చేస్తుందని పేర్కొంటూ అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో నల్లగొండలోని ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన సమయంలో కేసులు నమోదయ్యాయి. దీంతో నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు.

బత్తాయి రైతుకు ఊరట !

(5వ పేజీ తరువాయి)

ప్రాసెసింగ్‌కు అవసరమైన సాంకేతిక వృద్ధికి సైతం ప్రభుత్వం కార్యాచరణ అమలు చేయాల్సి ఉందని రైతులు కోరుతున్నారు. బత్తాయి జ్యూస్ తయారుచేసిన తర్వాత అది ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు అవసరమైన పరిశోధనలకు, బత్తాయి పండ్ల ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవసరమైన సాంకేతికతవృద్ధికి ప్రభుత్వాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఏప్రిల్‌లో లోక్‌సభలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ఇదే అంశంపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ శాఖ సహాయమంత్రి చిరాగ్ పాశ్వాన్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. బత్తాయిలోని నారింగన్, లిమోనిన్ వంటి మూలకాల కారణంగా చెట్టు నుంచి కాయను తెంపిన వారం, పది రోజుల్లోపే చేదుగా మారుతుందని, దీంతో మార్కెటింగ్ ఇబ్బందులతో బత్తాయి రైతులు అవస్థలు పడుతున్నారని, బత్తాయి ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు, జ్యూస్‌నిల్వలకు అవసరమైన సాంకేతికత సహకారానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టతనివ్వాలని ఎంపీ రఘువీర్ సూటిగా వేసిన ప్రశ్నకు సమాధానంగా కేంద్రమంత్రి ఈ విషయాన్ని స్పష్టంచేశారు. బత్తాయి జ్యూస్ నుంచి చేదు పదార్థాలను తొలగించేందుకు తంజావూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్‌ప్రాసెసింగ్ టెక్నాలజీ సంస్థ కానీ, మైసూర్‌లోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కానీ ఎలాంటి పరిశోధనలు జరపడంలేదని, అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం నుంచి కూడా ఇందుకు సంబంధించి ఎలాంటి పరిశోధనలు జరపడం లేదని కేంద్రమంత్రి ఆ సమాధానంలో తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్రం బత్తాయి మార్కెటింగ్ స్థిరత్వాన్ని దోహదపడేలా సాంకేతికవృద్ధికి సహకరించాలని ఆ రోజు లోక్‌సభలో ఎంపీ కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. తాజాగా రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సైతం ఇదే బత్తాయి పంటను కాపాడే ఉద్దేశ్యంతో వన్‌డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ పథకం కింద జిల్లాలో బత్తాయి పంటని చేర్చాలని కోరడంతో ఆ పథకాన్ని వర్తింపజేయడంతోపాటు, జిల్లాలో బత్తాయి సాగు స్థిరత్వానికి అవసరమైన టెక్నాలజీ వృద్ధికి తోడ్పడేలా పరిశోధనలు చేసి, జ్యూస్ నిల్వ ఉండేందుకు వీలుగా అవసరమైన సాంకేతికతను వృద్ధి చేసే పరిశోధనలతో పాటు, అందుకనుగుణంగా అవసరమైన నాణ్యమైన వంగడాలను ఉత్పత్తి చేసేలా కార్యాచరణను చేపట్టేందుకు మంత్రులు, ఎంపీ కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

క్రమంగా తగ్గిన బత్తాయి సాగు

ఉమ్మడి జిల్లాలో 2010 వరకు బత్తాయి పండ్లతోటల సాగు ప్రధాన పంటగా వర్ధిల్లింది. ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 3.10లక్షల ఎకరాల్లో బత్తాయి పంటలు సాగయ్యాయి. హైదరాబాద్‌తోపాటు, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై, ముంబై నగరాలకు ఇక్కడి నుంచి బత్తాయిని ఎగుమతి చేసేవారు. అనంతపురం, కడప, ప్రకాశం జిల్లాల్లోనూ బత్తాయి సాగైనప్పటికీ అతి స్వల్పంగానే అప్పట్లో ఉండడంతో ఈ జిల్లాలో పండే బత్తాయిలకు డిమాండ్ ఉండేది. క్రమేపీ అనంతపురం, ప్రకాశం జిల్లాలతోపాటు మహారాష్ట్రలోనూ బత్తాయి సాగు పెరిగింది. దీంతో పొరుగు రాష్ట్రాలకు తరలించి విక్రయించాలంటే రేటు గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రధానంగా బత్తాయికి నిల్వ సామర్థ్యం లేకపోవడం, పండ్ల రూపంలో గరిష్ఠంగా పదిరోజులకు మించి నిల్వ ఉంటే చేదుగా మారుతుండడం, జ్యూస్‌రూపంలోకి మార్చాక కనీసం రెండు, మూడు రోజుల పాటు కూడా చేదురాకుండా ఉండనిని పరిస్థితి బత్తాయి సాగుకు పెద్ద ఆటంకంగా మారింది.

బత్తాయి సాగుని ఒకదశలో ప్రత్యామ్నాయ పంటగా ప్రభుత్వం ప్రోత్సహించినప్పటికీ శాశ్వతంగా దాన్ని కొనసాగించేందుకు అవసరమైన సాంకేతికత వృద్ధి, పరిశోధనలను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయాలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలోనే మార్కెట్ ఇప్పటికీ కొనసాగుతుండడం వంటి కారణాలతో ఈ సాగు రైతులకు గిట్టుబాటు కావడంలేదు. దీంతో క్ర మంగా నీటివసరులున్న రైతులు బత్తాయి స్థానంలో వరి సాగు కు మారడంతో ఉమ్మడి జిల్లాలో 2010 సమయంలో దాదాపు 3.10లక్షల ఎకరాలు సాగైన బత్తాయి ప్రస్తుతం 45వేల ఎకరాలకు పడిపోయింది. గత అయిదారేళ్లుగా కొత్తగా రైతులెవరూ బత్తాయి సాగు చేపట్టడం లేదు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ

- రోడ్డు మీద ప్రవహిస్తున్న నీరు
- పట్టించుకోని అధికారులు

మర్రిగూడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొంతుగుట్ట సమీపంలో ఉన్న మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో కృష్ణా నీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది. మాల్‌లోని గోడుకొండ్ల పంపౌజ్ నుంచి ఎర్రగండ్లపల్లి గ్రామం మీదుగా రాజుపేట తండా, సరంపేట, రామ్‌రెడ్డిపల్లి, శివన్నగూడ, మెటీచందాపురం, తానేదార్‌పల్లి పలు గ్రామాలకు కృష్ణ నీరు సరఫరా అవుతుంది. మిషన్ భగీరథ మెయిన్ పైప్‌లైన్ వారం రోజులుగా లీకేజీ అయి నీరు రోడ్డు మీద ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు. మర్రిగూడ నుంచి మాల్‌కు వెళ్లే రోడ్డుకు పక్కనే బొంతు గుట్టకు ఆనుకొని ఉన్న ఈ పైప్‌లైన్ లీకేజీ కావడంతో గుంతగా మారింది. వారం రోజుల నుంచి పైపులను లీకేజీ అవుతున్నా దీనికి మరమ్మతులు చేయించకుండా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి లీకేజీ అవుతున్న మెయిన్ పైపునకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పాఠశాల బస్సులు దగ్ధం

- అర్ధరాత్రి సమయంలో మంటలు
- కేతేపల్లి మండలం రాయపురంలో ఘటన



రాయపురం సెయింట్ ఆన్స్ పాఠశాలలో దగ్ధమైన బస్సులు

కేతేపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలో నిలిపి ఉంచిన రెండు బస్సులు అర్ధరాత్రి సమయంలో కాలి బూడిదయ్యాయి. బుధవారం అర్ధరాత్రి కేతేపల్లి మండలం ఇనుపాముల ఆవాస గ్రామం రాయపురంలోని రాత్రి సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈ ప్రమాదం జరిగింది. పాఠశాల చుట్టూ ప్రహరీ ఉన్నా బస్సులు దగ్ధం కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల యాజమాన్యం, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాయపురం గ్రామంలో 30 సంవత్సరాలుగా సెయింట్ ఆన్స్ యాజమాన్యం ఇంగ్లీషు మీడియం పాఠశాలను నిర్వహిస్తోంది. బుధవారం సాయంత్రం పాఠశాలకు చెందిన మూడు బస్సులు పరిసర గ్రామాల్లోని విద్యార్థులను వారి స్వగ్రామాల్లో వదిలివచ్చిన తర్వాత డ్రైవర్లు పాఠశాల ఆవరణలో నిలిపి వెళ్లారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో పాఠశాల ఆవరణలో బస్సులు ఉన్నచోట పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడటంతో సమీపంలో ఉన్న సిస్టర్స్ గమనించి కేకలు వేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఇతర ఉపాధ్యాయినులతో పాటు పరిసరాల్లో నివసించేవారు అక్కడికి చేరుకునేసరికి రెండు బస్సులు మంటల్లో కాలిపోయాయి. గ్రామస్థుల్లో ఒకరు చాకచక్యంగా వ్యవహరించి మంటలు అంటుకోని ఓ బస్సును పక్కకు తీసుకువచ్చాడు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న నకిరేకల్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు ఆర్పారు. అప్పటికే రెండు బస్సులు పూర్తిగా కాలిపోయాయి. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్ఐ సతీష్ తెలిపారు.

బస్సుల దగ్ధం చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే వీరేశం

స్కూల్ బస్సులు దగ్ధమైన సంఘటనా స్థలాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం పరిశీలించారు. బస్సులు దగ్ధమైన సంఘటనకు సంబంధించి పాఠశాల యాజమాన్యంతో చర్చించి వివరాలను తెలుసుకున్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో ఫోన్‌లో మాట్లాడి ఈ సంఘటనపై లోతైన దర్యాప్తు జరపాలని కోరారు. బాధ్యులు ఎవరైనా కఠినంగా శిక్షించాలన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్, సీపీఎం నాయకులు బొజ్జ సుందర్, కె.మహేందర్‌రెడ్డి, చినవెంకులు, సాగర్, దయాకర్‌రెడ్డి ఉన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ, లయన్స్ క్లబ్ ఆఫ్ శాలిగౌరారం సంయుక్తంగా యశోద హస్పిటల్, మలక్‌పేట వారి సౌజన్యంతో మండలంలోని ఊట్కూరు గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యశిబిరాలు పేద మధ్యతరగతి వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. లయన్స్ క్లబ్ సేవే పరమావధిగా అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో దాదాపు 250 మందికి వైద్యబృందం పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు నిమ్మల పిచ్చయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, శ్రీనివాసులు, అశోక్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత బియ్యం పథకం 2030 వరకూ కొనసాగిస్తాం

- కేంద్ర ఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి
- నల్లగొండలో ఎఫ్‌సీఐ డివిజన్ కార్యాలయం ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి



కేంద్రమంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎంపీ రఘువీర్‌రెడ్డి

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కేంద్రం అందిస్తోన్న ఉచిత బియ్యం పథకం 2030 వరకు కొనసాగుతుందని కేంద్ర ఆహార, పౌర సరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రకటించారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఐ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన డివిజన్ కార్యాలయ భవనాన్ని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నల్లగొండ జిల్లాకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, అదే ప్రాముఖ్యతను కొనసాగిస్తూ జిల్లా ధాన్యం ఉత్పత్తిలో, ధాన్యం సేకరణలో రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. ఆహారభద్రతా వ్యవస్థను పటిష్టం చేసేందుకు రేషన్‌కార్డులన్నింటినీ డిజిటలైజ్ చేస్తున్నట్లు చెప్పారు. 7

లక్ష మెట్రిక్ టన్నులు మంజూరు చేయాలి : కేంద్రమంత్రికి గుత్తా లేఖ

2025-26 వానాకాలం సీజన్‌కు సంబంధించి నల్లగొండ జిల్లాకు కనీసం లక్ష మెట్రిక్ టన్నుల బాయిల్డ్‌రైస్ కోటాను మంజూరు చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు. గురువారం కేంద్రమంత్రి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంలో మండలి చైర్మన్ ఆయనకు లేఖ రాశారు. జిల్లాకు లక్ష మెట్రిక్‌టన్నుల బాయిల్డ్ రైస్‌కోటా కేటాయిస్తే, సీఎంఆర్ పంపిణీ సజావుగా సాగుతుందని లేఖలో వివరించారు. గోదాముల్లో భారీగా పేరుకుపోయిన బియ్యం నిల్వలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని, ఆనిల్వలను వేగంగా తరలించేందుకు వీలుగా జిల్లాకు అదనపు రైల్వే వ్యాగన్లు, ర్యాక్‌లు కేటాయించాలని సూచించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తన ప్రతిపాదనలు ఆమోదించాలని మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి కోరారు.

చికెన్ ధరలు	లైవ్ : రూ.170	డ్రెస్ : రూ.230	స్కిన్‌లెస్ : రూ.260

బత్తాయి రైతుకు ఊరట!



ఒక నాడు లక్షల ఎకరాల్లో సాగైన బత్తాయి రాను రాను వేల ఎకరాలకు పరిమితమైంది. బత్తాయికి నిల్వ సామర్థ్యం లేకపోవడం, పండ్ల రూపంలో గరిష్టంగా 10 రోజులకు మించి నిల్వ ఉంటే చేదుగా మారుతుండడం తదితర అంశాలు బత్తాయి సాగుకు పెద్ద ఆటంకంగా మారింది. అయితే జిల్లాలోని బత్తాయి రైతుకు ఊరట కలిగించే అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాలోచన చేస్తున్నాయి. వన్‌డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్ట్ పథకం కింద బత్తాయిని చేర్చాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేయడంతో మంచి రోజులు రానున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

-(ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- వన్‌డిస్ట్రిక్ట్- వన్ ప్రొడక్ట్ పథకం అమలుకు మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి
- కేంద్రమంత్రి జిల్లా పర్యటనలో తెర మీదకు బత్తాయిసాగు అంశం
- కోల్డ్‌స్టోరేజీ నిర్మించాలని సూచన

కేంద్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి నల్లగొండ పర్యటన సందర్భంగా బత్తాయి సాగు అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. నల్లగొండ జిల్లాలో ప్రధాన ఉద్యానపంటగా, మెట్ట రైతులకు కల్పతరువుగా నిలిచిన బత్తాయి పండ్ల తోటల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం, వనరుల కల్పన, మార్కెట్ సదుపాయాల్లేకపోవడం, డిమాండ్ తగ్గిపోవడం, బత్తాయి ప్రాసెసింగ్ చేసి ఉత్పత్తులు విక్రయించే టెక్నాలజీ లేకపోవడంవంటి కారణాలతో పదిహేనేళ్లలో సాగు క్షీణించిపోయింది. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశమున్న పంట అయినప్పటికీ దీన్ని కాపాడుకోవడంలో ప్రభుత్వాలు మద్దతుగా నిలవలేకపోయాయి. ఉమ్మడి జిల్లాలో 2010 ప్రాంతంలో అత్యధికంగా 3.10లక్షల ఎకరాల్లో బత్తాయి సాగైతే, ప్రస్తుతం అది 45వేల ఎకరాలకు పరిమితం కావడం జిల్లాలో బత్తాయి సాగు దుస్థితిని తెలియజేస్తోంది. కేంద్రం 2020నుంచి అమలు చేస్తోన్న వన్‌డిస్ట్రిక్ట్-వన్‌ప్రొడక్ట్ కింద జిల్లాలో బత్తాయి సాగును చేర్చాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం జిల్లా కేంద్రంలో కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ పర్యటన సందర్భంగా కోరడంతో బత్తాయి సాగు అంశం మరో సారి చర్చకు వచ్చింది. ఈ పథకంలో చేర్చడం, కోల్డ్‌స్టోరేజీల నిర్మాణంతో సరిపెట్టకుండా బత్తాయి మార్కెటింగ్‌కు ప్రధాన ఆటంకంగా మారిన నిల్వసామర్థ్యం పెంచేందుకు అవసరమైన టెక్నాలజీని వృద్ధి చేసేందుకు, బత్తాయిలో చేదును తొలగించేందుకు అవసరమైన పరిశోధనలు కొనసాగించేందుకు అవసరమైన కార్యాచరణ కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టేలా మంత్రులు, ఎంపీ చొరవ తీసుకోవాల్సి ఉందని బత్తాయి రైతులు కోరుతున్నారు.

టెక్నాలజీకి ఊతమిచ్చేలా..

బత్తాయి పండ్ల నిల్వ అవకాశాలు లేకపోవడం, పండ్ల ప్రాసెసింగ్‌కు జిల్లాలో సరైన సదుపాయాలు లేకపోవడం, బత్తాయి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సాంకేతిక వృద్ధికి ఇప్పటివరకు ప్రభుత్వాల నుంచి ఎలాంటి మద్దతు లేకపోవడంతో జిల్లాలో బత్తాయి సాగు ఎంతవేగంగా పెరిగిందో అంతేవేగంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో బత్తాయి సాగు సంరక్షణపై తాజాగా మళ్లీ చర్చ మొదలవుతున్న నేపథ్యంలో బత్తాయి పండ్ల నిల్వకు, మార్కెటింగ్‌కు వనరులు కల్పించడమే కాకుండా...

- మిగతా 8వ పేజీలో...

కేంద్రమంత్రిని కోరిన కోమటిరెడ్డి

జిల్లాలో బత్తాయి సాగులో ఎదురవుతున్న ఇబ్బందులను గురువారం నల్లగొండ జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి దృష్టికి రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీసుకొచ్చారు. జిల్లాలో నాణ్యమైన బత్తాయి ఉత్పత్తి జరుగుతుందని, ఏటా కనీసం 4.50లక్షల మెట్రిక్‌టన్నుల బత్తాయి ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. ఈ ఉత్పత్తుల విక్రయం రైతులకు సవాల్‌గా మారిందని, నిల్వకు అవకాశాలు లేకపోవడంతో రైతులు దళారుల చేతుల్లో దగాపడాల్సి వస్తోందని, దీన్ని నివారించేందుకు వన్‌డిస్ట్రిక్ట్-వన్‌ప్రొడక్ట్ పథకం కింద జిల్లాలో బత్తాయి సాగునిచేర్చి రైతులకు మేలు చేకూర్చాలని మంత్రి వెంకటరెడ్డి కోరారు. ఈ పథకం కింద చేర్చడం ద్వారా రైతులకు సాగు ప్రోత్సాహకాలతోపాటు, మార్కెటింగ్ సదుపాయాలు, కోల్డ్ స్టోరేజీలు అందుబాటులోకి రానుండడంతో బత్తాయి రైతులకు ఊరట లభిస్తుందని భావిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో బత్తాయి నిల్వ నిమిత్తం ఒక కోల్డ్‌స్టోరేజీని నిర్మించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చు

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీం అక్తర్



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్

నల్లగొండ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కష్టపడి చదివితే దేనినైనా సాధించవచ్చునని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీం అక్తర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదవడమే లక్ష్యంగ పెట్టుకోవాలని, చదువు జీవితంలో ఉన్నత స్థానంలో ఉంచుతుందన్నారు. చదువు అలవాటు చేసుకుంటే ఆలోచన శక్తి, సృజనాత్మక పెరుగుతాయన్నారు. తాను ఇదే గ్రంథాలయంలో మూడేళ్లు పుస్తక పఠనం చేశానన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ హఫీజ్ ఖాన్, కార్యదర్శి బాలమ్మ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ టీ మల్లారెడ్డి, ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ యూసుఫ్‌ఖాన్, ప్రతీక్ ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్‌లతో ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ భేటీ

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎఫ్‌సీఐ రాష్ట్ర జనరల్ మేనేజర్ నరసింహరాజు గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్‌తో కలసి రైస్‌మిల్లర్లతో భేటీ అయ్యారు. సీఎంఆర్ ధాన్యంపై చర్చించారు. 2024-25 యాసంగి, వానాకాలం సీజన్, 2025-26 వానాకాలం, యాసంగి సీజన్ సీఎంఆర్ డెలివరీల్లో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి నారాయణ, జనరల్ సెక్రటరీ రేపాల భద్రాద్రిరాములు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూలకంటి ఇంద్రారెడ్డి,నల్లగొండ సెంటర్ అధ్యక్షుడు వీరుమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇక నూతన.. విత్తన చట్టం



- రైతులు నష్టపోకుండా ఉండేలా ప్రణాళికలు
- ముసాయిదా విత్తన బిల్లుకు కేంద్రం యోచన
- సలహాలు, సూచనలు సేకరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- వానాకాలం నుంచి నూతన చట్టం అమలు

నల్లగొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): త్వరలో నూతన విత్తన చట్టం అమలులోకి రానుంది. ఇప్పటివరకు 1966 సంవత్సరానికి సంబంధించిన విత్తన చట్టం మాత్రమే అమలులో ఉండడంతో రైతులకు నష్టం వాటిల్లుతోందని కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. దీనిని దృష్టిలో ఉంచుకొని నూతన విత్తన చట్టం ముసాయిదా బిల్లు 2025కు సంబంధించి విత్తన రంగంలో మార్పులు తీసుకొచ్చి ముసాయిదా బిల్లును రూపొందించింది. విత్తన నాణ్యతను పెంచడం, రైతులకు నష్టం వాటిల్లకుండా భద్రత కల్పించడం, విత్తన మార్కెట్‌ను మరింత పారదర్శకంగా చేయడం కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. నూతన విత్తన చట్టం ప్రకారం రైతులకు పూర్తిస్థాయిలో మేలు చేసేలా వారి ప్రయోజనాలు కాపాడేలా చట్టాన్ని రూపొందిస్తున్నారు. విత్తన నాణ్యత పెంచాలనేది ఈ చట్టానికి సంబంధించిన ప్రధాన ఉద్దేశం. పాత విత్తన చట్టంలోని లోపాలను గుర్తించిన కేంద్రం 2025 సంవత్సరం ముసాయిదా విత్తన బిల్లులో ఎలాంటి లోపాలు లేకుండా ముందుకు సాగాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ బిల్లు ముసాయిదా దశలోనే ఉంది. దీనిపై లోతుగా అధ్యయనం చేస్తున్నారు. త్వరలోనే ఈ బిల్లు చట్టంగా మారితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వాల సలహాలు, సూచనలు సేకరించనుంది.

జిల్లాల వారీగా సలహాలు, సూచనల స్వీకరణ

కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ సలహాలను, సూచనలు స్వీకరిస్తుంది. నల్లగొండలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం నూతన విత్తన చట్టంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూర్యాపేటలో ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేయగా, యాదాద్రిభువనగిరి జిల్లాలో కూడా ఆయా ప్రాంతాల రైతులు, శాస్త్రవేత్తలతో సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూతన విత్తన చట్టం 2025పై అవగాహన, సలహాలు, సూచనల సేకరణ కోసం జరుగుతున్న సమావేశాలకు రైతులు, శాస్త్రవేత్తలు, విత్తన డీలర్లు, సీడ్ ప్రొడక్షన్ ఆర్గనైజర్లు, డిస్ట్రిబ్యూటర్లు, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు హాజరై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అదేవిధంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, కంపాసాగర్ కృషి విజ్ఞానకేంద్ర ఆధ్వర్యంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేసి కొత్త విత్తన చట్టంపై సూచనలు తీసుకుంటున్నారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించేందుకు సలహాలు, సూచనల ఆధారంగానే నివేదికలను రూపొందించనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 12లక్షలకు పైగా రైతులు ఉన్నారు. విత్తనాలను నమ్ముకొని పంటలు వేసిన తర్వాత...

- మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం

కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న నూతన విత్తన బిల్లు చట్టానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శాస్త్రవేత్తలు, రైతులు, అధికారులు, విత్తన డీలర్లతో పాటు అనుబంధ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశాం. శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశాల్లో కీలకమైన సమాచారాన్ని సేకరించి నివేదిక తయారు చేస్తున్నాం. నూతన విత్తన చట్టం బిల్లును స్వాగతించడమే కాకుండా విలువైన సలహాలు, సూచనలు, సమాచారాన్ని అందించారు. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం. నూతన విత్తన చట్టం వచ్చే వానాకాలం నుంచి అమలులోకి రానుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే రైతులకు నాణ్యమైన విత్తనాలు అందడంతో పాటు వారికి భద్రత కూడా ఉంటుంది.

- పి. శ్రవణ్‌కుమార్, జేడీఏ, నల్లగొండ.



ఫార్ములా ఈ రేస్ కేసులో చట్టపరంగానే చర్యలు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో చట్టపరంగానే చర్యలు ఉంటాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. నల్లగొండలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి ఇవ్వడంపై స్పందించారు. ఇది విచారణా సంస్థల పరిధిలోని అంశమని, సీఎంకు, తనకు, మంత్రులకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. తాము కక్ష సాధింపులకు పాల్పడబోమని, చట్టపరంగానే చర్యలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ లేనేలేదని, భవిష్యత్ అంతా కాంగ్రెస్‌దేనని అన్నారు. మరో 20 ఏళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని అన్నారు. స్థానిక సంస్థలు ఎన్నికల్లో 90శాతం కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

రహదారులపై ధాన్యాన్ని ఆరబెట్టవద్దు: ఎస్పీ

నల్లగొండ క్రైం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రహదారులపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి ప్రమాదాలకు కారకులు కావొద్దని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదలచేశారు. ధాన్యాన్ని రహదారులపై ఆరబోయడంవల్ల వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బంది కలిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు, వాహనదారులు ధాన్యం రాశులను గమనించిక ప్రమాదాలకు దారితీస్తున్నాయన్నారు.

బీ.వెల్లెంల ప్రాజెక్టు పూర్తికి భూ సేకరణే ఆలస్యం

- భూ సేకరణపై ఆసక్తి చూపని ప్రాజెక్టు ఏజెన్సీ
- ప్రధాన ఎడమ కాల్వ భూ సేకరణ పూర్తి
- సగమైనా కానీ ప్రధాన కుడి కాల్వ భూ సేకరణ

7



సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొనసాగిన సీపీఐ ప్రచారజాత

7



లంకె బిందెలు ఉన్నాయని నకిలీ నాణేలు ఇచ్చి..

- వ్యక్తి నుంచి రూ.12లక్షలతో ఉడాయించిన నలుగురు నిందితులు
- ఒకరిని పట్టుకున్న మిర్యాలగూడ పోలీసులు

6



నేటి నుంచి సైన్స్ ఉపాధ్యాయులతో సమావేశం


డీఈవో బొల్లారం భిక్షపతి



నల్లగొండటౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల చివరి వారంలో నిర్వహించబోయే జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టుల తయారీ తదితర అంశాలపై జిల్లాలోని అన్ని యాజమాన్యాల సైన్స్, గణితం ఉపాధ్యాయులకు ఈ నెల 21, 22 తేదీల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు బొల్లారం భిక్షపతి ఒకప్రకటనలో తెలిపారు. నల్లగొండలోని చర్లపల్లిలోగల డీవీఎం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో సమావేశం ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాధికారులు, పాఠశాల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నత ప్రాథమికోన్నత, కేజీబీవీ, మోడల్ స్కూల్స్‌లో పనిచేస్తున్న సైన్స్ (భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం), గణితం ఉపాధ్యాయులు సమావేశ నిమిత్తమై పంపించాలన్నారు. దీన్ని అత్యంత ప్రాధాన్యంగా గుర్తించి అందరూ ఆయా సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

చెర్వుగట్టుపై వైభవంగా లక్షపుష్పార్చన

భారీగా తరలివచ్చిన భక్తులు



లక్ష పుష్పార్చన పూజలు చేస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం రాత్రి లక్షపుష్పార్చన వేడుక వైభవంగా జరిగింది. కార్తీకమాసం చివరి రోజు అమావాస్య కావడంతో హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి శివభక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. రద్దీ సమయంలో ఘాట్‌రోడ్డుపై వాహనాలను అనుమతించలేదు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో సల్వాది మోహన్ బాబు ఏర్పాట్లుచేశారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చకు లు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య లక్షపుష్పార్చన వేడుక వైభవం గా జరిగింది. కార్తీక మాసం చివరి రోజు కావడంతో గుట్టపై ఉన్న హోమగుండంలో పూర్ణాహుతి సమర్పించారు. ప్రసాద శాలను ఈవో సల్వాది మోహన్‌బాబు తనిఖీ చేసి పులిహోర, లడ్డూ ప్రసాదాల తయారీని స్వయంగా తూ కం వేసి, రుచి చూసి నాణ్యతను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఫ్లెక్సీల ఏర్పాటు: గుట్టపై భక్తుల సూచనలతో కూడిన ఫ్లెక్సీలను పలు ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పుష్కరిణిలో తడిబట్టలు, పసుపు కుంకుమలతో స్నానం చేయకూడదని పక్కనే ఉన్న కుళాయిల వద్ద జల్లు స్నానం చేసిన తర్వాతే దిగాలని సూచించారు. ప్రసాదాల కవర్లు ఇతర వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా గుట్టపై పలు చోట్ల చెత్త బుట్టలను ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లు పాటించాలని, దర్శన సమయంలో ఇతర భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు.

సనాతన ధర్మం కోసం వీహెచ్‌పీ పోరాటం...

సనాతన హిందూ ధర్మాన్ని కాపాడటం కోసం వీహెచ్‌పీ పోరాటం చేస్తుందని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి అన్నారు. వీహెచ్‌పీ జిల్లా ధర్మాచార్య సంపర్క్ విభాగ్ ఆధ్వర్యంలో చెర్వుగట్టు దేవస్థానం వద్ద గురువారం ఉదయం నిర్వహించిన గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రతీ నెలా అమావాస్య, పౌర్ణమి తిథుల్లో నిర్వహించే ఈ గిరిప్రదిక్షణకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ ఉంద్యాల ప్రకాశ్‌రెడ్డి, నరసింహ, మేడిశెట్టి వెంకటయ్య, బలేం యాదగిరి, అలుగుబెల్లి వెంకట్ రెడ్డి, మల్లెబోయిన రామలింగం, చల్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం : ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని 27వ వార్డు శాంతినగర్‌లో గొట్టిముక్కల లక్ష్మణాచారి, నామిని కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యేపాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులద్దేశించి మాట్లాడుతూ మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కోసం ఆధ్యాత్మిక బావాలు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలు, గిరిధర్, ఇంద్రకుమార్, వెంకన్న, శ్రీను, వర్మ, రాజేందర్, శివాజీ, లింగారెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

మారేపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భగత్

హాలియా,నవంబరు20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారేపల్లి గ్రామం స్వయం భూ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ గురువారం పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే భగత్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కూరాకుల వెంకటేశ్వర్లు, మట్టపల్లి వెంకన్న, గడిద శ్రీకాంత్, బొల్లం హరికృష్ణ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

'సూర్యాపేట జిల్లాకు ధర్మ భిక్షం పేరు పెట్టాలి'

మిర్యాలగూడ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకు ధర్మ బిక్షం పేరు పెట్టాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మలి దశ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీగా ధర్మ బిక్షం ప్రజలకు సేవలందించారన్నారు. కమ్యూనిస్టు నేతగా పీడిత ప్రజల హక్కుల సాధనకు అహర్నిషలు పోరాడిన ఆయనకు సూర్యాపేట ప్రాంతానికి వీడదీయరాని బంధం ఉందన్నారు. సూర్యాపేట జిల్లాకు ధర్మ బిక్షం పేరు పెట్టి గౌరవించుకోవాల్సిన అవసరముందని, ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ ఎస్టీ, ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు దైద బాల తెలిపారు. ఈ మేరకు గురువారం డిపో మేనేజర్ రామ్మోహనరెడ్డిని గ్రీవెన్స్ మీటింగ్‌లో కోరినట్లు చెప్పారు. డబుల్ డ్యూటీ చేసిన ఉద్యోగులకు అదనపు వేతనం చెల్లించాలని, గ్యారేజీ కార్మికులపై పనిభారం తగ్గించాలన్నారు. మహాలక్ష్మి పథకంలో సేవలందిస్తున్న కండక్టర్లపై తీవ్ర ఒత్తిడి పెరిగిందన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు అదనంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నూతన నియామకాలు చేపట్టాలని, కోఆపరేటివ్ నిధులు ఉద్యోగులందరికీ పంచాలని కోరినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ సీఐ భారతీబాయి, అధికారులు కే.యాదగిరి, మేళ్ల వెంకటేశ్వర్లు, భాగ్యరాజు, హతీరాం, ప్రతాప్‌సింగ్, వెంకటరత్నం పాల్గొన్నారు.

హన్యానాయక్‌కు ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న హన్యానాయక్

మిర్యాలగూడ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణానికి చెందిన సోషల్ వర్కర్, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయక్ ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందించిన రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో హన్యానాయక్ బెస్ట్ సర్వీస్ విభాగంలో అవార్డు అందుకున్నారు. ఆధ్యాత్మిక, సేవా విభాగాల్లో అందుకున్న ఈ అవార్డు తన బాధ్యత పెంచిందని హన్యానాయక్ తెలిపారు., కాగా బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకున్న హన్యానాయక్‌కు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, క్రైస్తవ సంఘ నేతలు శుభాకాంక్షలు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం మాయం

గుర్రంపోడు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని చామలోనిబావి గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం మయామైంది. గ్రామానికి చెందిన ఎరకల ఆంజనేయులు 10 రోజుల క్రితం ఆరు డబ్బాల ధాన్యాన్ని ఐకేపీ కేంద్రంలో పోయగా తీరా కాంటా వేయగా ఒక డబ్బా ధాన్యం తక్కువగా వచ్చిందని గురువారం తెలిపారు. డబ్బా ధాన్యానికి 14 బస్తాల నుంచి 15 బస్తాల వరకు అవుతాయని 6 డబ్బాలకు 70 బస్తాలు కావాల్సి ఉండగా 62 బస్తాలు మాత్రమే అయ్యాయని రైతు వాపోయాడు. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో గురువారం పిర్యాదు చేసినట్లు రైతు ఆంజనేయులు తెలిపారు. ధాన్యాన్ని దొంగిలించిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు.

మహాసభలకు గీత కార్మికులు తరలిరావాలి

తిరుమలగిరి(సాగర్), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికుల సమస్యల సాధన కోసం ఈనెలలో నిర్వహించనున్న 4వ రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆ కమిటీ రాష్ట్ర సభ్యుడు వేములకొండ పుల్లయ్య అన్నారు. మండలంలోని నెల్లికల్ గ్రామంలో నిగురువారం ర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో సూర్యాపేటలో గీత కార్మికుల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లింగమయ్య, శ్రీను, వెంకన్న, లాలయ్య పాల్గొన్నారు.

కొండమల్లేపల్లిలో బ్రాహ్మణుల సమారాధన



సమారాధనలో పాల్గొన్న బ్రాహ్మణులు

కొండమల్లేపల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాయి సిద్దార్థ స్కూల్‌లో గురువారం బ్రాహ్మణుల సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గం బ్రాహ్మణ సంఘం సభ్యులు పరమేశ్వరునికి అభిషేకం, అర్చన జరిపారు. కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కుర్మేటి రవి ప్రసాద్, పురోహితులు పాల గణపతి శర్మ, పాల సదాశివశర్మ, డేరం జయప్రకాశ్, సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగంటి రాజశేఖర్‌రావు, ఉట్కూరి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజు, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

గతుకులమయం

● మిర్యాలగూడలో అధ్వానంగా ప్రధాన రహదారులు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు ● కొందరు స్వచ్ఛందంగా మరమ్మతు



గుంతలమయంగా మారిన రాజారైస్ మిల్ రహదారి

- పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ కింద ఏర్పడిన గుంతలతో వాహనదారులు పడుతున్న అవస్థలను చూసిన ఓ యువకుడు తన ఎక్స్‌కవేటర్‌తో గుంతలను పూడ్చాడు.
- డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగం చేస్తున్న సీతారాంపురానికి చెందిన ఓ యువకుడు బైక్‌పై డ్యూటీకి వెళ్తుండగా గుంతల కారణంగా నడుం పట్టేసింది. వారం రోజులు సెలవుపెట్టి ఇంట్లో కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- శాంతినగర్ నుంచి నందిపాడు చౌరస్తాకు వెళ్లే అంతర్గత రోడ్డులోని గుంతల కారణంగా ఇబ్బంది పడుతున్న స్థానికులు.. స్వచ్ఛభారత్ తరహాలో కలిసికట్టుగా గుంతలు పూడ్చేసుకున్నారు.
- డియర్ రోడ్స్ విష్ యూ ఏ స్పీడ్ రికవరీ.. అంటూ ఓ ఫీమేల్ నెటిజన్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

(ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణంలోని పలు వార్డుల్లో అంతర్గత రహదారులతో పాటు ప్రధాన మార్గాలు అధ్వానంగా మారాయి. ఇక శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో గంతలతో పాటు రాళ్లు తేలి స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణకు ఒకరు, పైప్‌లైన్ ఏర్పాటుకు మరొకరు రహదారులకు తూట్లు పొడుస్తూ, పూడ్చడం మరిచిపోతున్నారు. ఇక వర్షపు నీరు నిలిచిన కారణంగా పలు రహదారుల్లో గాతులు ఏర్పడగా, పట్టణం నుంచి బైపాస్ రోడ్డుకు ప్రధాన రహదారులైన టాకా రోడ్డులో సుమారు కిలోమీటరు మేర ఉన్న వందలాది గుంతలను పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. నెలల తరబడి తాత్కాలిక, నామమాత్రపు మరమ్మతు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలో ఏళ్ల తరబడి ఉన్న గుంతలతో పాటు ఈ సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని పలు కాలనీల్లో రహదారులు గుంతలమయ ంగా మారాయి. స్థానిక ప్రజాప్రతినిధులకు చె ప్పినా, అధికారులకు విన్నవించినా ఫలితం లే కుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విన్నవించినా స్పందన లేదు



టాకారోడ్ నుంచి నందిపాడ్ చౌరస్తాకు వెళ్లే రహదారంతా గుంతలమయంగా మారింది. రోడ్డు విస్తరణ పేరుతో అటు, ఇటు తవ్వించిన అధికారులు పూడ్చడం లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నెలల తరబడి ఇలా ఉండట తో ఈ మార్గం గుండా రావాలంటేనే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. డెలివరీ బాయ్స్ ఈ రోడ ్డకు రా వడానికే జంకుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించినా స్పందన లేదు.

- తెడ్ల కిరణ్‌కుమార్, శాంతినగర్

ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి



భారీ వర్షాలకు పట్టణంలోని పలు రహదారులు గుంతలమయంగా మారాయి. ఆయా రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాం ఇక టాకారోడ్‌ను విస్తరించేందుకు చేపట్టిన పనులు పూర్తి కాలేదు. ఆ పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. ఇక ఇబ్బంది ఉండదు.

- శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్

రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలి

దేవరకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి):దేవరకొండ నియోజకవర్గంలో ఈనెల 26వ తేదీన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు, డిండి మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26న దేవరకొండతోపాటు అన్ని మండలాలు, గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించి రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలని వారు కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

మిర్యాలగూడ : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయ రీడర్స్‌కు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సామాజికవేత్త డాక్టర్ జాడిరాజు చెప్పారు. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం గ్రంథాలయంలో 'రాజ్యాంగం-ఎదుర్కొంటున్న' సవాళ్లు అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించామని అన్నారు. ఇటీవల డా.ముప్పా రామారావు ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక నిర్వహించిన నెహ్రూ ఆలోచనా విధానం-శాస్త్రీయ దృక్పథం అ నే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రస్తుత వ్యాసరచనలో గెలుపొందిన గ్రంథాలయ రీడర్స్‌కు ఈ నెల 26న గ్రంథాలయ భవనంలో బహుమతులు అందజేస్తామని అన్నారు. సుదర్శన్, సుధాకర్ ఉన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్ట్ నేడు

మిర్యాలగూడ టౌన్ : జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి గురువారం టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి, రాఫెల్ తెలిపారు. మూఢ నమ్మకాలను పారదోలి, సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తి పెంచడమే లక్ష్యంగా పాఠశాల స్థాయిలో ప్రతీ ఏటా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8, 9, 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే మండల స్థాయి పరీక్షను నియోజకవర్గంలోని అన్ని 5 మండల కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'జనహిత'



తూర్పుపల్లిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే జనహిత మార్నింగ్‌వాక్ విత్ పీపుల్ కార్యక్రమం చేపట్టినట్లు దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. మండలంలోని తూర్పుపల్లి గ్రా మంలో గురువారం జనహిత మార్నింగ్ వాక్ నిర్వహించారు. అధికారులు, నాయకులతో కలిసి గ్రామంలోని ఇంటింటికి వెళ్లి అభివృద్ధి పథకాలు అమలవుతున్నాయా, సమస్యలను అడిగి ప్రజలతో మాట్లాడి అవసరాలను తెలుసుకున్నారు. తూర్పుపల్లిలో మెయిన్‌రోడ్డు నుంచి దర్గా వరకు రహదారిని విస్తరించి సీసీ రోడ్డు ని ర్మాణం చేపడుతామన్నారు. గ్రామంలో ఇప్పటికే 19 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కొనసాగుతున్నాయని, అదనంగా మరో 20 ఇళ్లు పేదలకు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సొంత భవనం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామ ప్రజలకు ఉపయోగపడే బీసీ కమ్యూనిటిహాల్ నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. ఆయన వెంట దేవరకొండ ఎంపీడీవో డానియేల్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, లోకసాని శ్రీధర్‌రెడ్డి, కొర్ర రాంసింగ్ గృహ నిర్మాణ, విద్యుత్, ఐబీ, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండ మండలం కొండభీమనపల్లి చెరువులో చేప పిల్లలను అధికారులతో కలిసి విడుదల చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని 241 చెరువుల్లో రూ.2 కోట్ల కుపైగా చేప పిల్లలను విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చేప పిల్లల విడుదలతో చెరువుల పునరుద్ధరణ చెంది చేపల ఉత్పత్తి అధికమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, మత్స్యశాఖ అధికారి రమేష్, రుక్మారెడ్డి, ఆలంపల్లి నర్సింహ పాల్గొన్నారు. అలాగే కొండభీమనపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

మాడ్గులపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించే విధంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాములపాడు పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే ప్రజల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం వైద్య సేవలు అందించాలని అన్నారు. గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు వివరించాలని అన్నారు.అనంతరం రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏమైనా సమస్య ఉంటే నేరుగా దృష్టికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, వైద్యులు సత్యనారాయణ, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వడ్ల బోనస్ తక్షణమే అందించాలి



రైతులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హాలియా, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని నేటికీ వడ్ల బోనస్ అందించకపోవడం దారుణమని తక్షణమే అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలం లోని ఇబ్రహీంపేట కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి రైతుల సమస్యల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చి వారం రోజులు దాటినా బస్తాలు రాకపోవడం కాంటాలు కాకపోవడం వల్ల పట్టాల ఖర్చులు పెరిగిపోతున్నాయన్నారు. యాసంగి వడ్ల బోనస్ ఇంత వరకు అందలేదని ఇప్పుడు ఇస్తానన్న బోనస్ ఎప్పటికీ అందుతుందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుతా సైదులు, రైతు సఘం జిల్లా సహాయ కార్యదర్శి కత్తి శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, రాములు, అంజమ్మ, వెంకటమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

● రవీందర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, దేవరకొండ



రైతులు తాము పండించిన పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని దేవరకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి సూచించారు. ప్రభుత్వం సీసీఐ కేంద్రంలో క్వింటాల్‌కు రూ .8,100 మద్దతు ధర చెల్లింస్తుందని కొనుగోలు చేస్తుందని దళారీలు, వ్యాపా రులకు విక్రయించి మోసపోవద్దని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

(ఆంధ్రజ్యోతి-దేవరకొండ)

ఆంధ్రజ్యోతి: దేవరకొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో ఎన్ని కేంద్రాలను ఏర్పాటు చేశారు?

కార్యదర్శి : చిన్నఅడిశర్లపల్లిలో- 2, పీఏపల్లిలో- 1, చెన్నారంలో -1, డిండి మండలంలో- 1 నాలుగు సీసీఐ కేంద్రాలను ప్రారంభించాం. సీసీఐ అధికారులు ఇప్పటివరకు 11 వేల క్వింటాళ్ల పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేశారు.

ఆంధ్రజ్యోతి: దేవరకొండ మార్కెట్ పరిధిలో ఎన్ని సబ్‌మార్కెట్లు ఉన్నాయి?

కార్యదర్శి : దేవరకొండ, డిండి, కొండమల్లేపల్లి, పీఏపల్లి సబ్ మార్కెట్‌యార్డులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

కార్యదర్శి: పత్తి రైతులు కపాస్ కిసాన్ ఖయాప్‌లో పంట నమోదు చేసుకోవాలి. అధికారుల సూచనలతో పత్తి పంటను సీసీఐ కేంద్రాలకు తరలించాలి.

ఆంధ్రజ్యోతి: మార్కెట్‌లలో రైతులకు వసతుల మాటేమిటి?

కార్యదర్శి: వ్యవసాయ మార్కెట్‌తోపాటు సబ్ మార్కెట్‌లలో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మార్కెట్‌యార్డులకు సౌకర్యాలకు రూ.7కోట్ల ప్రతిపాదనలు పంపించాం.

ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దఅడిశర్లపల్లి,నవంబరు20(ఆంధ్రజ్యోతి):మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ వసతి గృహంలో ఏఎన్ఎంగా పనిచేయడానికి అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వెంకటయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తమ సర్టిఫికెట్‌లను తీసుకుని ఈ నెల 24వ తేదీలోపు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా రావులపాటి రవిశంకర్



హాలియా,నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా రావులపాటి రవిశంకర్ నియమితులయ్యారు. ఈసందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం రవిశంకర్ మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ గ్రామ స్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బత్తాయి రైతుకు ఊరట!

(5వ పేజీ తరువాయి)

ప్రాసెసింగ్‌కు అవసరమైన సాంకేతిక వృద్ధికి సైతం ప్రభుత్వం కార్యాచరణ అమలు చేయాల్సి ఉందని రైతులు కోరుతున్నారు. బత్తాయి జ్యూస్ తయారుచేసిన తర్వాత అది ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు అవసరమైన పరిశోధనలకు, బత్తాయి పండ్ల ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవసరమైన సాంకేతికతవృద్ధికి ప్రభుత్వాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఏప్రిల్‌లో లోక్‌సభలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి ఇదే అంశంపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆహార ప్రాసెసింగ్ శాఖ సహాయమంత్రి చిరాగ్ పాశ్వాన్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. బత్తాయిలోని నారింగన్, లిమోనిన్ వంటి మూలకాల కారణంగా చెట్టు నుంచి కాయను తెంపిన వారం, పది రోజుల్లోపే చేదుగా మారుతుందని, దీంతో మార్కెటింగ్ ఇబ్బందులతో బత్తాయి రైతులు అవస్థలు పడుతున్నారని, బత్తాయి ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు, జ్యూస్‌నిల్వలకు అవసరమైన సాంకేతికత సహకారానికి కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టతనివ్వాలని ఎంపీ రఘువీర్ సూటిగా వేసిన ప్రశ్నకు సమాధానంగా కేంద్రమంత్రి స్పష్టంచేశారు. బత్తాయి జ్యూస్ నుంచి చేదుపదార్థాలను తొలగించేందుకు తంజావూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్‌ప్రాసెసింగ్ టెక్నాలజీ సంస్థకానీ, మైసూర్‌లోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కానీ ఎ లాంటి పరిశోధనలు జరపడంలేదని, అదేవిధంగా తెలంగాణ ప్ర భుత్వం నుంచి కూడా ఇందుకు సంబంధించి ఎలాంటి పరిశోధనలు జరపడం లేదని కేంద్రమంత్రి ఆ సమాధానంలో తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్రం బత్తాయి మార్కెటింగ్ స్థిరత్వాన్ని దోహదపడేలా సాంకేతికవృద్ధికి సహకరించాలని ఆ రోజు లోక్‌సభలో ఎంపీ కేంద్రానికి విజ్ఞప్తిచేశారు. తాజాగా రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సైతం ఇదే బత్తాయి పంటను కాపాడే ఉద్దేశ్యంతో వన్‌డిస్ట్రిక్ట్-వన్ ప్రొడక్ట్ పథకం కింద జిల్లాలో బత్తాయి పంటని చేర్చాలని కోరడంతో ఆ పథకాన్ని వర్తింపజేయడంతోపాటు, జిల్లాలో బత్తాయి సాగు స్థిరత్వానికి అవసరమైన టెక్నాలజీ వృద్ధికి తోడ్పడేలా పరిశోధనలు చేసి, జ్యూస్ నిల్వ ఉం డేందుకు వీలుగా అవసరమైన సాం కేతికతను వృద్ధి చేసే పరిశోధనలతోపాటు, అందుకనుగుణంగా అవసరమైన నాణ్యమైన వంగడాలను ఉత్పత్తి చేసేలా కార్యాచరణను చేపట్టేందుకు మంత్రులు, ఎంపీ కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

క్రమంగా తగ్గిన బత్తాయి సాగు

ఉమ్మడి జిల్లాలో 2010 వరకు బత్తాయి పండ్లతోటల సాగు ప్రధాన పంటగా వర్ధిల్లింది. ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 3.10లక్షల ఎకరాల్లో బత్తాయి పంటలు సాగయ్యాయి. హైదరాబాద్‌తోపాటు, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నై, ముంబై నగరాలకు ఇక్కడి నుంచి బత్తాయిని ఎగుమతి చేసేవారు. అనంతపు రం, కడప, ప్రకాశం జిల్లాల్లోనూ బత్తాయి సాగైనప్పటికీ అతి స్వల్పంగానే అప్పట్లో ఉండడంతో ఈ జిల్లాలో పండే బత్తాయిలకు డిమాండ్ ఉండేది. క్రమేపీ అనంతపురం, ప్రకాశం జిల్లాలతోపాటు మహారాష్ట్రలోనూ బత్తాయి సాగు పెరిగింది. దీంతో పొరుగు రాష్ట్రాలకు తరలించి విక్రయించాలంటే రేటు గిట్టుబాటు కాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రధానంగా బత్తాయికి నిల్వ సామర్థ్యం లేకపోవడం, పండ్ల రూపంలో గరిష్ఠంగా పదిరోజులకు మించి నిల్వ ఉంటే చేదుగా మారుతుండడం, జ్యూస్‌రూపంలోకి మార్చాక కనీసం రెండు, మూడు రోజులపాటు కూడా చేదు రాకుండా ఉండని పరిస్థితి బత్తాయి సాగుకు పెద్ద ఆటంకంగా మారింది. బత్తా యి సాగుని ఒకదశలో ప్రత్యామ్నాయ పంటగా ప్రభుత్వం ప్రోత్సహించినప్పటికీ శాశ్వతంగా దాన్ని కొనసాగించేందుకు అవసరమైన సాంకేతికత వృద్ధి, పరిశోధనలను ప్రభుత్వాలు పట్టించుకోలేదు. స్థానికంగా మార్కెటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారుల చేతిలోనే మార్కెట్ ఇప్పటికీ కొనసాగుతుండడం వంటి కారణాలతో ఈసాగు రైతులకు గిట్టుబాటు కావడంలేదు. దీంతో క్రమంగా నీటివనరులున్న రైతులు బత్తాయి స్థానంలో వరి సాగుకు మారడంతో ఉమ్మడి జిల్లాలో 2010 సమయంలో దాదాపు 3.10లక్షల ఎకరాలు సాగైన బత్తాయి ప్రస్తుతం 45 వేల ఎకరాలకు పడిపోయింది.అయిదారేళ్లుగా కొత్తగా రైతులెవరూ బత్తాయి సాగుచేపట్టడం లేదు.

ఇక నూతన విత్తన చట్టం

(5వపేజీ తరువాయి)

దిగుబడి రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులకు ఉపయోగపడే విధంగా వివరాలు తీసుకుంటున్నారు.

ప్రతి కంపెనీ విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్

నూతన విత్తన చట్టం వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమల్లోకి రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లాల వారీగా సేకరిస్తున్న సలహాలు, సూచనలను ఒక్కటి, రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో పంపనున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి నివేదికలు సేకరించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 11వ తేదీలోపు కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపనుంది. ఈ నూతన విత్తన చట్టానికి అన్ని వర్గాల నుంచి ఆమోదం లభిస్తుంది. ప్రస్తుతం పాతచట్టం అంటే 1966 సంవత్సరం ప్రకారం నోటిఫైడ్ అయిన ప్రభుత్వం నుంచి లైసెన్స్‌డ్ విత్తనాలు విక్రయిస్తున్నా చాలాచోట్ల ఇతర విత్తనాల వల్ల కూడా రైతులకు నష్టం వాటిల్లుతోంది. నూతనచట్టం ప్రకారం విత్తనోత్పత్తి చేస్తే కొత్త చట్టానికి అనుగుణంగా లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో నమోదైన తర్వాతే విత్తనాలు విక్రయించేలా చర్యలు తీసుకోనున్నారు. దీనికి తోడు ప్రతి విత్తన ప్యాకెట్‌పై క్యూఆర్ కోడ్‌తో పాటు ధర తప్పనిసరిగా ముద్రించాల్సి ఉంటుంది. క్యూఆర్ కోడ్‌స్కాన్ చేసిన వెంటనే ఆయా కంపెనీ వివరాలు వెల్లడవుతాయి. నాణ్యతను విస్మరించి రైతులకు నష్టం వాటిల్లేలా చేస్తే రెండేళ్ల జైలుతో పాటు రూ.30లక్షల వరకు జరిమానా విధించే విధంగా ఈ చట్టాన్ని రూపొందిస్తున్నారు. చిన్నచిన్న పొరపాట్లు చేస్తే లైసెన్స్ కూడా రద్దు చేస్తారు. ప్రతీ కంపెనీకి సంబంధించి అనుమానం వస్తే నమూనాలు సేకరించిన తర్వాత ల్యాబ్‌లో టెస్ట్ చేయడానికి రూ.5లక్షల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉండటంతో పకడ్బందీగా విత్తన బిల్లును రూపొందించాలని కేంద్రం తలపెట్టింది.

పల్లెల్లో ముదిరాజ్ ఆత్మగౌరవ జెండా ఎగరాలి

హాలియా,నవంబరు20(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ మహాసభ 21న ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామంలో ముదిరాజుల ఆత్మగౌరవ జెండాలు ఎగురవేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి డిగం నాగయ్య ముదిరాజ్ పిలుపునిచ్చారు. గురువారం హాలియాలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు.